## నేటి కందం-నేటికి అందం

యాగముగా భావించుచు
భోగాపుర మందు ఎయిరు పోర్టును మోడీ
తేగలగి మహాంధ్ర జనుల
రాగామృత ఫల మటంచు ప్రారంభించెన్ !!

(ఆంధ్రుల కోరికల ఫలంగా భావిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ భోగాపురం ఎయిర్ పోర్ట్ ను ప్రారంభించారు. దీని వలన ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి జరుగుతుందని అందరూ భావిస్తున్నారు.)

-రాధశ్రీ

సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్  సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

## చురక

మాదక ద్రవ్యాలకు
మనిషి అయితే బానిస
సర్వస్వం కోల్పోయిన
సామ్రాజ్యపు తానీషా.
ప్రభుత్వాలు పట్టుపట్టి
ప్రకటించినా నిషేదం
అయినాగాని విస్తరిస్తూ
అవుతున్నది విషాదం.

-వేల్పుల నారాయణ

9440433475



హైదరాబాద్ మంగళవారం 4-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:1 పేజీలు:6 వెల: రూ.1/-


# నిజామాబాద్ ఆరోగ్య సేవలపై

## మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష..




నిజామాబాద్, ఆగస్టు 3: జిల్లాలో ఆరోగ్య సేవల పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు సహా సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై అధికారులను ప్రశ్నించి అవసరమైన సూచనలు చేశారు.

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన సిబ్బంది నియామకం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

# మీరు నా మాట వినట్లేదు.. నేను సంతోషంగా రాలేదు..

## -భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత



హైదరాబాద్, ఆగస్టు 3: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు.

ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ట చేయిస్తానని మాట ఇచ్చారని.. కానీ మాట నిలబెట్టుకోవడం లేదని అన్నారు. విగ్రహ ప్రతిష్టకు ఎవరు అడ్డువచ్చినా ఊరుకోనని హెచ్చరించారు.

# జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

## జారీ చేస్తాం!: మంత్రి పొన్నం



హైదరాబాద్, ఆగస్టు 3: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు.

జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# తిరుప్పరంకుంద్రం దీపం వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూ ఢిల్లీ, ఆగస్టు 3:తిరుప్పరంకుంద్రం దీపం వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మధురైలోని తిరుప్పరంకుంద్రం కొండపై కార్తీక దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది.

జనవరి నెలలో మద్రాస్ హైకోర్టు ఆర్డర్ పాస్ చేస్తే.. మీరెందుకు జూన్ నెలలో పిటిషన్ వేశారంటూ తమిళనాడు ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. కొండపై రాతి స్తంభం వద్ద దీపం వెలిగించే సంప్రదాయం ఉందా అని ప్రశ్నిస్తూ.. మద్రాస్ హైకోర్టు తీర్పును సమగ్రంగా పరిశీలించడానికి సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. ఈ కేసులో ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసిన కోర్టు.. ఆరు వారాల్లోగా సమాధానాలు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

# ఇందిరా పార్క్ చౌరస్తాలో నిరుద్యోగుల మెరుపు ధర్నా



హైదరాబాద్, ఆగస్టు 3: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో నిరుద్యోగుల మెరుపు ధర్నా చేపట్టారు. 7,437 పోస్టులతో కాకుండా 19 వేల పోలీస్ ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేయాలని, పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలంటూ డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ ఆలస్యంతో వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పోలీస్ నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలన్నారు.

# బంగ్లాదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

## ముగ్గురు అరెస్ట్.. మరో తొమ్మిది మంది కోసం గాలింపు



ఆదిలాబాద్, ఆగస్టు 3: బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి దేశంలోని పలు రాష్ట్రాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదిలాబాద్ పోలీసులు ఛేదించారు. నకిలీ ఆధార్ కార్డులతో తొమ్మిదేళ్లుగా ఏడు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం వెల్లడించారు.

ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్ జిల్లాకు చెందిన మహమ్మద్ జానీ అలీ, మహమ్మద్ రొమాన్స్ అలీ అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి నకిలీ ఆధార్ కార్డులు సృష్టించుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ జానీ అలీ 12 మంది సభ్యులతో ముఠాను ఏర్పాటు చేసి రాజస్థాన్, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. జూలై 11న బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి ప్రవేశించిన ఈ ముఠా సభ్యులు ముందుగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో మోటార్ సైకిళ్లు, కార్లు చోరీ చేసి, అనంతరం తెలంగాణలోని ఆదిలాబాద్‌కు చేరుకుని దొంగతనాలకు పాల్పడ్డారని వెల్లడించారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ జానీ అలీ గతంలో మధ్యప్రదేశ్‌లో నమోదైన ఓ చోరీ కేసులో అరెస్టై జైలు శిక్ష కూడా అనుభవించినట్లు ఎస్పీ తెలిపారు. బంగ్లాదేశ్‌కు చెందిన మరో 12 మంది సభ్యులతో వీరికి సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

కుక్కర్లు అమ్ముతూ రెక్కీ.. రాత్రిళ్లు చోరీలు

ఈ ముఠా సభ్యులు పగటి సమయంలో కుక్కర్లు, గ్రైండర్లు విక్రయిస్తున్నట్లు నటిస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ నేత ఇంట్లో చోరీ సొత్తు స్వాధీనం

ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఇటీవల ఈ ముఠా చోరీకి పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.8 లక్షల విలువైన 73.05 గ్రాముల బంగారం, 151.30 గ్రాముల వెండి, ఐఫోన్లు, ఐప్యాడ్‌తో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఈ కేసులో మహమ్మద్ జానీ అలీ, మహమ్మద్ రొమాన్స్ అలీ, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన తరుణ్ సింగ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో తొమ్మిది మంది సభ్యుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన మావల సీఐ బీడీ ప్రేమ్‌కుమార్, సైబర్ క్రైమ్ ఎస్సై గోపీకృష్ణ, సిబ్బంది త్రిశూల్, శ్రీనివాస్ తదితరులను ఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సైబర్ క్రైమ్ ఎస్సై గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగర వాసులకు రెయిన్ అలర్ట్..

## భారీ వర్షాలు కురిసే ఛాన్స్

హైదరాబాద్, ఆగస్టు 3:భాగ్యనగరవాసులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ అలర్ట్ జారీ చేశారు. ఈరోజు (సోమవారం) రాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు.

బయట ఉన్నవారు వెంటనే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సీపీ సజ్జనార్ తెలిపారు. నీరు నిలిచిన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణాలు చేయొద్దని హెచ్చరించారు. ముంపు ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారులు వేగం తగ్గించి జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# 'రష్యన్ అమెజాన్' వేర్‌హౌజ్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి



న్యూఢిల్లీ, ఆగస్టు 3: రష్యాపై భీకర స్థాయిలో డ్రోన్లతో అటాక్ చేసింది ఉక్రెయిన్. శనివారం రష్యా చేసిన దాడికి ప్రతీకారంగా ఉక్రెయిన్ విరుచకుపడింది. అయితే వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్(ఖీబీబబతిజీని చిజీతీవష్టనీబీబవ)ను టార్గెట్ చేసింది. రష్యాన్‌లో ఆన్‌లైన్ రిటేలర్‌గా ఉన్న వైల్డ్‌బెర్రీస్ వేర్‌హౌజ్‌పై దాడి చేసింది. దీన్ని రష్యా అమెజాన్‌గా కీర్తిస్తుంటారు. మాస్కోకు సుమారు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్‌ను డ్రోన్‌తో అటాక్ చేసినట్లు వీడియోలు రిలీజ్ అయ్యాయి. వైల్డ్‌బెర్రీస్ వేర్‌హౌజ్.. రష్యాలో కీలకమైన లాజిస్టిక్ హబ్. అయితే ఆ కేంద్రాలను ఉక్రెయిన్ టార్గెట్ చేస్తున్నది. రష్యా మిలిటరీకి డ్రోన్ కాంపోనెంట్లు, నావిగేషన్ ఎక్విప్మెంట్, ఇతర సామాగ్రిని ఈ వేర్‌హౌజ్‌ల నుంచి సరఫరా చేస్తుంటారు. వైల్డ్‌బెర్రీస్ సైట్లపై ఇటీవల ఉక్రెయిన్ వరుసగా దాడి చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం రష్యా బాలిస్టిక్ క్షిపణులతో కీవ్‌పై దాడి చేసింది. ఆ ఘటనలో 9 మంది మృతిచెందగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఉక్రెయిన్‌లోని పలు నగరాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

# టీ-ఫైబర్ పనులు వేగవంతం చేయాలి

## -రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



హైదరాబాద్, ఆగస్టు 3: రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్-ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ఆయన సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా డిజిటల్ ఇండియా వికసిత్ భారత్-2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్ల ఏర్పాటు, కృత్రిమ మేధస్సు (ఏఐ), సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ గవర్నెన్స్ సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంలో ప్రపంచ బ్యాంక్ అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

దేశంలో డిజిటల్ పెట్టుబడులకు తెలంగాణ, హర్యానా రాష్ట్రాలు అత్యంత అనుకూలంగా ఉన్నాయని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు పేర్కొన్నారు. సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.

సమావేశం అనంతరం టీ-ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, సేవల విస్తరణపై అధికారులతో సమీక్షించారు.

# మూడేళ్లలో 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సలు

హైదరాబాద్, ఆగస్టు 3:హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) అత్యాధునిక వైద్య సేవల్లో మరో కీలక మైలురాయిని చేరుకుంది. రోబోటిక్ సర్జరీ సేవలు ప్రారంభించిన మూడేళ్లలోపే 1,000 రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.

ఈ శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం 248, సర్జికల్ ఆంకాలజీ విభాగం 162 శస్త్రచికిత్సలు నిర్వహించింది. కిడ్నీ మార్పిడి, క్యాన్సర్ చికిత్సలు, క్లిష్ట పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు వంటి సంక్లిష్ట వైద్య ప్రక్రియలను కూడా రోబోటిక్ సాంకేతికతతో విజయవంతంగా నిర్వహించడం విశేషం. అత్యంత ఖరీదైన ఈ రోబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) వంటి ప్రభుత్వ పథకాల ద్వారా రోగులకు పూర్తిగా ఉచితంగా అందించడం మరో విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డా. రాహుల్ దేవరాజ్ వైద్యులు, శస్త్రచికిత్స బృందాలను అభినందించారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర రాజనరసింహ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించిన మార్గదర్శకం, ప్రభుత్వ సహకారంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు.

# సింగిల్ వర్కింగ్ మహిళల పట్ల వివక్ష అమానవీయం

## (04 ఆగస్టు "సింగిల్ వర్కింగ్ వూమెన్స్ దినం" సందర్భంగా)

మహిళలు అంటేనే మగమహారాజులకు చులకన. పురుషాధిక్య సమాజంలో మహిళ నేటికీ ద్వితీయ శ్రేణి పౌరురాలే. బాలికలు, యువతులు, మహిళల పట్ల మృగాళ్ల చూపులు నేటికీ ముళ్ల వలె గుచ్చుకుంటున్నాయి. లైంగిక హింసలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ ఉద్యోగ ఉపాధులు, పలు రకాల పనులు చేసుకుంటున్న మహిళలకు భద్రత కరువు అవుతున్నది. పని ప్రదేశంలో వివక్ష కోరలు విప్పుతున్నారు. కాలక్రమంలో క్రమంగా సమాజ దృక్కోణం మారుతోంది. నేటి విద్యాధికులైన మహిళలకు కొంత ఆదరణ పెరుగుతోంది. నేటి డిజిటల్ యుగంలో వర్కింగ్ వూమెన్స్ లేదా పని చేస్తున్న మహిళలు పలు రకాల సమస్యలకు లోనవుతున్నారని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తమ తమ ఉద్యోగ ఉపాధుల్లో ఉన్న సింగిల్ వర్కింగ్ మహిళల వేదనలు వర్ణనాతీతం. పురుషులు లేదా వివాహిత మహిళలతో ధీటుగా లేదా మెరుగైన సేవలు చేస్తున్న ఒంటరి మహిళల సమస్యలు మరింత జటిలంగా ఉన్నాయి.

### సింగిల్ వర్కింగ్ వుమెన్స్ దినం-2026 :

వివాహం కాని లేదా చేసుకోని మహిళలు, వితంతువులు పనుల చేసుకుంటున్న వారిని "సింగిల్ వర్కింగ్ వుమెన్స్" లేదా "పనులు చేసుకుంటున్న ఒంటరి మహిళలు" అని పిలుస్తున్నాం. పలు వర్కింగ్ నూనెని తమ కుటుంబ భారాలను మోస్తూ వృత్తిలో సహితం రాణిస్తున్నారు. ఇలాంటి సింగిల్ వర్కింగ్ వూమెన్స్ పట్ల సమాజం పలు అపోహలను కలిగి వారిని కించపరచడం జరుగుతోంది." బార్బారా పైనే" అను వ్యక్తి చొరవతో సింగిల్ వర్కింగ్ వుమెన్స్ సమస్యల పట్ల అవగాహన కలిగిస్తూ, వారికి ప్రోత్సహించడానికి లేదా అభినందించడానికి ప్రతి ఏట 04 ఆగస్టు రోజున "సింగిల్ వర్కింగ్ వుమెన్స్ దినం" పాటించడం జరుగుతోంది. సింగిల్ వర్కింగ్ వుమెన్స్ చేస్తున్న కృషి, నమోదు చేసుకుంటున్న విజయాలు, బలాలు, ఎపిక్, సృజన, ధైర్యం, ఆత్మవిశ్వాసం లాంటివి గుర్తించకుండా లింగ వివక్ష చీరడం సోచనీయం. వృత్తిలో నిబద్ధత, కుటుంబ భారం మోయడం, వ్యక్తిగత జీవితాన్ని గడపడంలో సమతుల్యతను చూపడం ఒక ప్రశంసనీయ అనుభవం.

### భారత్‌లో సింగిల్ వర్కింగ్ వుమెన్స్ సమస్యలు:

సింగిల్ వర్కింగ్ వుమెన్స్ సమస్యలు భారతంలో అధికంగానే ఉన్నాయి. సామాజిక దురభిప్రాయాలు, భద్రత చిక్కులు, వృత్తితో పాటు కుటుంబ వ్యక్తిగత పనుల మధ్య సమతుల్యత లోపించడం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, చిన్నచూపు చూడడం, అతి తక్కువ వేతనాలు ఇవ్వడం, వివాహం కాలేదని ఎగతాళిగా చూడటం, ఆర్థిక అభద్రత, విజేతలైన సింగిల్ వర్కింగ్ వుమెన్స్‌కు తగిన గుర్తింపు ఇవ్వకపోవడం, సమాజ నిరాదరణకు గురవడం, పనిలో పదోన్నతులు కల్పించకపోవడం లాంటి పలు సమాళ్లను నేటి భారత ఒంటరి మహిళలు ఎదుర్కొంటున్నారు. ఈ విధమైన వివక్షలను ఎదుర్కొంటున్న సింగిల్ వర్కింగ్ వుమెన్స్ మానసిక ఒత్తిడి, ఆందోళన లాంటి అనారోగ్యాలకు దగ్గర అవుతున్నారు.

వ్యక్తిగత విషయాలు, కుటుంబ సభ్యుల సమస్యలు, వృత్తిలో వేధింపులు లాంటివి పెరగడంతో సింగిల్ వర్కింగ్ వుమెన్స్ బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. ఇలాంటి

సింగిల్ వర్కింగ్ వుమెన్స్ పట్ల పౌర సమాజం తగిన విధంగా ఆదరించడం, వారి సేవలను కొనియాడడం, వారికి అవసర చేయూతను ఇవ్వడం జరగాలి. సింగిల్ వర్కింగ్ వుమెన్స్ పిల్లలకు తగిన అవకాశాలు కల్పించడం కొనసాగాలి. సింగిల్ వర్కింగ్ వుమెన్స్ పట్ల మానవ దృక్కోణం మారాలి, వారికి అండగా పౌర సమాజం నిలవాలి.



-మధుపాళీ
9949700037

# ఆగస్టు 7న 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించనున్న కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 3:భారత దేశ చేనేత వారసత్వాన్ని వేడుకగా జరుపుకునేందుకు, దేశ సాంస్కృతిక, ఆర్థికాభివృద్ధికి చేనేత కార్మిక వర్గం అందించిన తోడ్పాటును గుర్తించేందుకు ఆగస్టు 7, 2026న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్ (ఆర్‌బీసీసీ)లో 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ నిర్వహించనుంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము హాజరవుతారు. ఈ వేడుకలో కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్, కేంద్ర జౌళి శాఖ రాష్ట్ర మంత్రి శ్రీ పవిత్ర మార్గెరిటా, కార్యదర్శి (జౌళి శాఖ) శ్రీమతి నీలం షామీ రావు, అభివృద్ధి కమిషనర్ (చేనేత) డాక్టర్ ఎం. బీనా పాల్గొంటారు.

ఈ వేడుకల్లో సంత్ కబీర్ హ్యాండ్లూమ్ అవార్డు గ్రహీతలు, జాతీయ చేనేత అవార్డు గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు, దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు, అవార్డుల ఎంపిక కమిటీ సభ్యులు, చేనేత రంగానికి చెందిన ప్రముఖులు, సీనియర్ ప్రభుత్వాధికారులు, మీడియా ప్రతినిధులు, ఇతర విశిష్ట అతిథులు పాల్గొంటారు.

ఈ వేడుకల్లో భాగంగా 2025 సంవత్సరానికి గాను సంత్ కబీర్ హ్యాండ్లూమ్ అవార్డులు, జాతీయ చేనేత అవార్డుల ప్రధానోత్సవం ఉంటుంది. భారతదేశ చేనేత సంప్రదాయాలను పరిరక్షించటంలో అద్భుతమైన నైపుణ్యం, ఆవిష్కరణలు, కృషికి గుర్తింపుగా 03 సంత్ కబీర్ హ్యాండ్లూమ్ అవార్డులు, 19 జాతీయ చేనేత అవార్డులతో కలిపి మొత్తం 22 అవార్డులను ప్రతిభావంతులైన చేనేత కార్మికులకు అందజేస్తారు.

ఈ వేడుకలో భారత సుసంపన్న, వైవిధ్యభరిత చేనేత వస్త్ర పరిశ్రమను గౌరవిస్తూ నాలుగు స్మారక పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేస్తారు.

ఈ కార్యక్రమంలో రెండు ప్రచురణలు..."ఎర్త్. రూట్. థ్రెడ్ - ఆల్ డైడ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ ఆఫ్ సెంట్రల్ ఇండియా'', హ్యాండ్లూమ్ అవార్డ్స్ బుక్-2025ని ఆవిష్కరిస్తారు.

ఈ కార్యక్రమంలో అవార్డు గెలుచుకున్న చేనేత ఉత్పత్తులను ప్రదర్శనకు పెడతారు. సంప్రదాయ కనీ నేత, వాల్ హ్యాంగింగ్ నేతలను సందర్శకులు ప్రత్యక్షంగా తిలకించే అవకాశం ఉంటుంది. ఇది భారతదేశ చేనేత సంప్రదాయాల వైవిధ్యాన్ని, హస్తకళా నైపుణ్యాన్ని కళ్లకు కడుతుంది.

ఆగస్టు 7, 2026న జరిగే ప్రధాన కార్యక్రమంతో పాటు, జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదర్శనలు, కాన్‌క్లేవ్‌లు (డిజైనర్, ఐఐహెచ్‌టీ) మొదలైన ఇతర ముఖ్యమైన కార్యక్రమాలు కూడా ఉంటాయి.

దేశంలో అత్యధిక గ్రామీణ ఉపాధి కల్పిస్తున్న అతిపెద్ద రంగాల్లో భారత చేనేత రంగం ఒకటిగా కొనసాగుతోంది. ఇది 35 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలకు అండగా నిలుస్తోంది. అందులో 70 శాతానికి పైగా మహిళా శ్రామికులున్నారు. ఆర్థిక ప్రాముఖ్యతతో పాటు భారతదేశ గొప్ప వస్త్ర సంప్రదాయాలను సంరక్షిస్తూ, పర్యావరణపరంగా స్థిరమైన ఉత్పాదక విధానాలకు ఈ రంగం కీలక తోడ్పాటునందిస్తుంది.

జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏటా ఆగస్టు 7న నిర్వహిస్తారు. ఆగస్టు 7, 1905న ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం జ్ఞాపకార్థంగా ఈ రోజును జరుపుకుంటారు. ఈ ఉద్యమం దేశీయ పరిశ్రమలకు, భారతదేశ చేనేత రంగానికి నూతనోత్తేజాన్ని అందిస్తుంది. దేశ సాంస్కృతిక వారసత్వానికి, సామాజిక-ఆర్థికాభివృద్ధికి చేనేత కార్మికులు అందిస్తున్న అమూల్యమైన సేవలను ఈ దినోత్సవం గుర్తిస్తుంది.

2015లో ప్రారంభమైనప్పటి నుంచి భారతదేశ చేనేత కార్మికుల కళాత్మక నైపుణ్యాన్ని, ప్రతిభను, అంకితభావాన్ని వేడుకగా జరుపుకునేందుకు జాతీయ చేనేత దినోత్సవం వేదికగా నిలుస్తోంది. చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు, ప్రోత్సహించేందుకు, సుస్థిరాభివృద్ధికి ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతను ఇది స్పష్టం చేస్తోంది.

# భల్స్వా డంప్‌సైట్ పునరుద్ధరణ ప్రక్రియను తనిఖీ చేసిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్; పాత వ్యర్థాల నిర్మూలన పనుల పురోగతిపై సమీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 3:కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ ఈ రోజు భల్స్వా డంప్‌సైట్ వద్ద ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) చేపట్టిన పాత వ్యర్థాల నిర్మూలన పనుల పురోగతిని సమీక్షించారు. పాత వ్యర్థాల నిర్మూలనను వేగవంతం చేయడంతో పాటు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పాన్ని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) పట్టణాభివృద్ధి విభాగానికి చెందిన సీనియర్ అధికారులు ఈ తనిఖీలో పాల్గొన్నారు.

ఈ సమీక్ష సందర్భంగా, 2026 జూలై 31 నాటికి భల్స్వా డంప్‌సైట్‌లో 99.07 లక్షల మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాల నిర్మూలన పూర్తయిందని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) కేంద్ర మంత్రికి తెలియజేసింది. మిగిలిన పాత వ్యర్థాల గుట్టను 2026 అక్టోబర్ 15 నాటికి పూర్తిగా తొలగించే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. 2026 మార్చి వరకు పేరుకుపోయిన మొత్తం వ్యర్థాలను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తిగా తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది.

ల్యాండ్‌ఫిల్ ప్రాంతానికి ప్రతిరోజూ చేరుతున్న తాజా వ్యర్థాల ప్రాసెసింగ్ కోసం ఇటీవల అప్పగించిన పనులను వేగవంతం చేయాలని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు. దీంతో డంప్‌సైట్ నిర్మూలన పనులు మరింత వేగంగా సాగడంతో పాటు, కొత్తగా వచ్చే వ్యర్థాలను ఎలాంటి జాప్యం లేకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

## -కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య



ఆదిలాబాద్, ఆగష్టు 3 :ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన వసతి, పౌష్టికాహారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ వి. చంద్రయ్య అన్నారు.

ఆదివారం చెన్నూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల తహసీల్దార్ మల్లికార్జున్, మండల విద్యాధికారితో కలిసి ఆయన సందర్శించారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

అనంతరం విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని నిరంతరం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

భోజనశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యాలయ ప్రాంగణంలో ఉన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని చెన్నూర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా విద్యాలయానికి వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మెరుగైన విద్య, భద్రత, వసతి, పోషకాహారం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, పౌష్టికాహారం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# వైసీపీ పాలన అరాచకానికి కేరాఫ్ అడ్రస్..

## డీఎస్సీపై చర్చకు లోకేష్ సిద్ధం..చర్చకు ముందుకు రాని వైసిపి..



అమరావతి, ఆగష్టు 3: వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని, సంక్షేమానికి చంద్రబాబే చిరునామా అని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న విమర్శించారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుద్దా వెంకన్న మాట్లాడుతూ, అరాచక పాలనకు పేటెంట్ హక్కులు జగన్‌మోహన్‌రెడ్డికే ఉన్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే విరూపాక్షి దళితుడైన గురునాథ్‌పై దాడి చేసిన ఘటనలో చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అలాంటి ఘటనలను సమర్థించడం తగదని వ్యాఖ్యానించారు. సంక్షేమం అంటే చంద్రబాబు, చంద్రబాబు అంటే సంక్షేమమని పేర్కొన్న ఆయన, అరాచకం అంటే జగన్‌మోహన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి అంటే అరాచకమని విమర్శించారు.






# అట్టహాసంగా ఎంపి చిన్ని జన్మదిన వేడుకలు..

## -పండుగ వాతావరణంలో..

## పెద్ద ఎత్తున నిర్వహించిన టిడిపి శ్రేణులు..

అమరావతి, ఆగష్టు 3: విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని పశ్చిమ నియోజకవర్గంలోని బుద్ధ వెంకన్న కార్యాలయంలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అట్టహాసంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు కేక్ కట్ చేసి ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలకు పెద్ద ఎత్తున అభిమానులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు హాజరై సందడి చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొని ఎంపీ చిన్ని దీర్ఘాయుష్షు, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# 70 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, ఒక లారీ స్వాధీనం

## -ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ సూచన

ఆదిలాబాద్, ఆగష్టు 3:ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని భైంసా ఏఎస్పీ సాయికిరణ్ తెలిపారు. సోమవారం బాసరలోని ఆర్టీసీ బస్టాండ్ సమీప ప్రాంతంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, ఒక లారీతో పాటు నంబర్ ప్లేట్ లేని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ సాయికిరణ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముధోల్, బాసర సీఐలు రవీందర్ నాయక్, దీపక్, ఎస్సైలు బిట్ల పెర్సిస్, ప్రదీప్, జుబేర్, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, పోలీసు సిబ్బంది, హోం గార్డులు పాల్గొన్నారు.

# సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి: టీబీజీకేఎస్

అమరావతి, ఆగష్టు 3: సింగరేణి బొగ్గు పరిశ్రమలో గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, లేని పక్షంలో సెప్టెంబర్ 9 నుంచి కంపెనీలో జరిగే అధికారిక కార్యక్రమాలను అడ్డుకుంటామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి హెచ్చరించారు.

సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 8తో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించని పక్షంలో కంపెనీ అధికారిక కార్యక్రమాల్లో అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

ఏ ఐ టీ య ్ ు సీ , ఐఎన్‌టీయూసీలను కార్మికులు తిరస్కరించకపోతే బొగ్గు గని కార్మికుల హక్కులు హరించబడేవని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిలో కార్మికుల సంఖ్యను తగ్గించేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం వైఖరి, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 9న సింగరేణి వ్యాప్తంగా చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొత్త గనుల ప్రారంభం, నియామక విధానంపై స్పష్టత లేదని విమర్శించారు. క్రమశిక్షణా చర్యల పేరుతో వందలాది మంది కార్మికులను తొలగించే ప్రయత్నాలను ఖండించారు. 12వ వేజ్ బోర్డు అమలు కోసం కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు.

బొగ్గు పరిశ్రమకు, కార్మికుల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించబోమని, అవసరమైతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, చెల్పూరి సతీష్, శేషగిరి, జోసఫ్, సంపత్, సాయి చరణ్, రహమాన్, శ్రీనివాస్, ప్రసన్నకుమార్, సతీష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## -ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో రాస్తారోకో




కరీంనగర్, ఆగష్టు 3: ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మారం సందీప్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు చేరాయని, నిధులు విడుదల కాక వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ రాష్ట్ర కన్వీనర్ ఓమేష్, నగర కార్యదర్శి అరవింద్, నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్, నాయకులు సిద్ధార్థ్, శివ, దినేష్, కార్తీక్, శైలజ, మౌనికతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# డీఏపీ ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతుల ఆందోళన

కరీంనగర్, ఆగష్టు 3:గొల్లపల్లి మండలంలో డీఏపీ ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు కుమ్మక్కై ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు డీఏపీ ఎరువులు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో సుమారు 15 ఫర్టిలైజర్ దుకాణాలు ఉండగా, అన్ని దుకాణాల్లో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ అదనపు ధర చెల్లించిన వారికి మాత్రమే విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కో డీఏపీ సంచి ఎంఆర్పీని రూ.1,350గా నిర్ణయించగా, గొల్లపల్లిలో ఒక్కో సంచిపై రూ.500 అదనంగా వసూలు చేస్తూ రూ.1,850కు విక్రయిస్తున్నారని ఆరోపించారు.

ఈ వ్యవహారం వ్యవసాయ అధికారుల సమక్షంలోనే జరుగుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. వరి సాగు పనులు ప్రారంభమైన ఈ సమయంలో డీఏపీ ఎరువులకు భారీ డిమాండ్ ఉండటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారని తెలిపారు.

అధిక ధరల గురించి ప్రశ్నించిన రైతులకు తమ వద్ద డీఏపీ నిల్వలు లేవని చెప్పి పంపిస్తున్నారని, అయితే అదనపు ధర చెల్లించే వారికి మాత్రం ఎరువులు విక్రయిస్తున్నారని ఆరోపించారు.

జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి డీఏపీ ఎరువులను ఎంఆర్పీ ధరలకే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఎస్టీ బాలికల హాస్టల్‌లో 27 మంది విద్యార్థినులు అస్వస్థత

## -ఆహారం వికటించి... ఆస్పత్రిలో చికిత్స



ములుగు, ఆగష్టు 3: (నేటినిజం ప్రతినిధి)వర్ధన్నపేటలోని ఎస్టీ బాలికల హాస్టల్‌లో 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో వారిని సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సమాచారం ప్రకారం, ఆదివారం విద్యార్థినులు చికెన్‌తో భోజనం చేసిన అనంతరం సాయంత్రం నుంచి కొందరికి విరేచనాలు, వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించాయి. దీంతో హాస్టల్ సిబ్బంది అప్రమత్తమై సోమవారం ఉదయం వారిని ఆస్పత్రికి తరలించారు.

వైద్యుల సమాచారం ప్రకారం, 27 మంది విద్యార్థినుల్లో ఎనిమిది మందికి కడుపునొప్పి ఉండగా, ఇద్దరిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మిగిలిన వారికి చికిత్స కొనసాగుతోంది.

విద్యార్థినుల అస్వస్థతకు ఆహారం వికటించడమే కారణమా అనే అంశంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# చోరీ కేసు ఛేదన.. నిందితుడి అరెస్ట్

కరీంనగర్, ఆగష్టు 3:పెద్దపల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో జరిగిన ఇంటి చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. టౌన్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, హనుమాన్‌నగర్‌కు చెందిన రాయిని రమాదేవి, అర్జున్ దంపతులు మే 27న ఇంటికి తాళం వేసి సుల్తానా బాద్‌కు వెళ్లారు. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న దుండగుడు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 5 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 10 గ్రాముల బరువున్న రెండు బంగారు ఉంగరాలు, ఒక జత వెండి కాళ్ల పట్టీలను అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మే 30న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం భూమ్ నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పెద్దపల్లి శాంతి నగర్‌కు చెందిన మిర్యాల రంజిత్‌రెడ్డి (25)ను అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీ చేసినట్లు అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఎస్‌డీఆర్ఎఫ్ కింద వరద ప్రభావిత రాష్ట్రాలకు 2,117.85 కోట్ల నిధుల ముందస్తు విడుదలకు ఆమోదం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 3:ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వేళ వరద బారినపడిన రాష్ట్రాలకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం 'రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి' (ఎస్‌డీఆర్ఎఫ్)లో కేంద్ర వాటా నుంచి ?2,117.85 కోట్ల ముందస్తు విడుదలకు కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఆమోదం తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సమర్థ సహాయక, రక్షణ, పునరావాస చర్యల దిశగా రాష్ట్రాలకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ప్రకటించారు. అంతేకాకుండా పరిస్థితులపై నిశిత పర్యవేక్షణను కూడా కొనసాగిస్తుందని పేర్కొన్నారు. రుతుపవనాలు ప్రవేశించిన నాటినుంచీ కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలతో సన్నిహిత సమన్వయంతో వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తోంది. అవసరమైన ప్రతి సందర్భంలోనూ 'జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం' (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను ముందుగానే మోహరిస్తోంది. అంతేగాక రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి రవాణా-వనరుల మద్దతు వంటి సాధ్యమైన అన్నిరకాల సాయాన్నీ కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

ఇందులో భాగంగా నష్టంపై అంచనా నిమిత్తం అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాలకు అంతర-మంత్రిత్వ శాఖ కేంద్ర బృందాలను కేంద్రం ఇప్పటికే పంపింది. వరదల తీవ్రత దృష్ట్యా అస్సాంలో రెండుసార్లు ఈ బృందాలు పర్యటించాయి. అలాగే, నాగాలాండ్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఆ రాష్ట్రం కోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ప్రభావిత 7 రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, ఒడిషాలకు 2026-27 సంవత్సరం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) తొలి విడత నిధులు ఇప్పటికే అందాయి. అంతేకాకుండా సహాయ చర్యల కోసం నిధులు సకాలంలో అందుబాటులో ఉండేవిధంగా హిమాచల్ ప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలకు ఎస్‌డీఆర్ఎఫ్ కేంద్ర వాటా సంబంధిత రెండో విడత నిధుల ముందస్తు విడుదలకు కేంద్ర హోం మంత్రి ఆమోదం తెలిపారు. అంతేగాక సహాయక చర్యలకు వనరుల అత్యవసరమనే వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్లకూ వర్తించే మార్గదర్శకాలలోని పత్రాల సమర్పణ నిబంధనలను సడలించారు. దీంతో ఎస్‌డీఆర్ఎఫ్ కేంద్ర వాటాలో తొలివిడత నిధులను ముందగానే విడుదల చేసేందుకు ఆమోదం లభించింది.

ప్రభావిత రాష్ట్రాలకు 2026-27కుగాను ఆమోదిత సహాయం కింద ఎస్‌డీఆర్ఎఫ్ కేంద్ర వాటాలో తొలివిడతగా అరుణాచల్ ప్రదేశ్‌కు ?44.55 కోట్లు విడుదల చేశారు. అలాగే అస్సాం రాష్ట్రానికి ?379.35 కోట్లు, గుజరాత్‌కు ?500 కోట్ల మేర విడుదలకు ఆమోదం లభించింది. ఇక ఈ నిధులను ఇప్పటికే పొందిన హిమాచల్ ప్రదేశ్‌కు మాత్రం కేంద్ర వాటాలో రెండో విడతగా 193.95 కోట్లు మంజూరు కాగా, మహా రాష్ట్రకు తొలివిడతగా 500 కోట్ల ముందస్తుగా విడుదలకు ఆమోదముద్ర పడింది. మరోవైపు తొలి విడత నిధులు అందుకున్న ఒడిశాకు రెండో విడతగా ?500 కోట్ల ముందస్తు విడుదలకు ఆమోదం లభించింది.

# గ్రూప్స్ జాప్యంపై ఆత్మహత్యాయత్నం

ఖమ్మం, ఆగష్టు 3: గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి. వేణుకుమార్ను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేణుకుమార్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడిన నాయకులు వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, ఆయనకు అత్యుత్తమ వైద్యం అందించాలని సూచించారు. అనంతరం వేణుకుమార్ రాసిన లేఖను పరిశీలించి, ఆయన నాయనమ్మతో పాటు కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారువేణుకుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన బీఆర్ఎస్ నేతలు, ఈ క్లిష్ట సమయంలో పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతలో నెలకొన్న ఆందోళనలను ప్రభుత్వం గుర్తించి, నియామక ప్రక్రియలను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# మహారాష్ట్రలోని పుణేలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం ప్రదానం చేసిన కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగష్టు 3:మహారాష్ట్రలోని పుణేలో ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) శ్రీ అజిత్ దోవల్‌కు లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం - 2026ను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి శ్రీ ఏక్‌నాథ్ షిండే, శ్రీమతి సునేత్రా పవార్, కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మొహోల్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, నేడు లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్ 106వ వర్ధంతి అని, భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ఒక కొత్త దిశను, అర్థాన్ని ఇచ్చేందుకు తిలక్ మహారాజ్ "స్వరాజ్యం నా జన్మహక్కు, దానిని నేను సాధించి తీరుతాను" అనే మంత్రాన్ని ఇచ్చారని తెలిపారు. మన పాలనా వ్యవస్థ, భాష, సంస్కృతి, ధర్మం దృఢంగా పాదుకొని ఉన్నప్పుడే పూర్తి స్వరాజ్యం సిద్ధించినట్టు చెప్పగలమని శ్రీ అమిత్ షా వ్యాఖ్యానించారు. తిలక్ మహారాజ్ ప్రజాసమూహాలను స్వరాజ్యం, స్వాతంత్ర్య ఉద్యమాలతో అనుసంధానించారని శ్రీ షా అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలోకి 'సాంస్కృతిక జాతీయవాదం' అనే కొత్త రూపం జాతీయవాదాన్ని కూడా శ్రీ తిలక్ ప్రవేశపెట్టారని ఆయన పేర్కొన్నారు. లోక్‌మాన్య తిలక్ మహారాజ్ దేశానికి స్వాతంత్ర్య సమర స్ఫూర్తినే కాకుండా, భవిష్యత్తులో భారత్ అనుసరించాల్సిన మార్గాన్నీ నిర్దేశించారని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారత్ ఇదే మార్గంలో ముందుకు సాగుతుందని తిలక్ విశ్వాసం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. నేడు దేశం అదే సాంస్కృతిక జాతీయవాద మార్గంలో పయనిస్తోందని శ్రీ అమిత్ షా అన్నారు.

లోకమాన్య తిలక్ ఒక ఉపాధ్యాయుడు, అత్యుత్తమ పాత్రికేయుడు కూడా అని శ్రీఅమిత్ షా తెలిపారు. ఒక గొప్ప ఆలోచనాపరుడిగా ఆయన ప్రపంచం ముందు భారతదేశ ఆత్మను ఆవిష్కరించారని కోట్లాది మంది హృదయాలలో స్వరాజ్య కాంక్షను రగిలించారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలమంతటిలో లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్‌కు సాటిరాగల వారెవరూ లేరని, ఆయన ఒక దీర్ఘదర్శి, అసాధారణ ఉపాధ్యాయుడు, భయమెరుగని జర్నలిస్ట్, గొప్ప ఆలోచనాపరుడు, నిరంతర కర్మయోగి అని శ్రీ షా కొనియాడారు.

లోక్‌మాన్య తిలక్ మహారాజ్ భగవద్గీత సారాన్ని ఆచరణాత్మకంగా దేశ ప్రజలకు అందించారని శ్రీ అమిత్ షా అన్నారు. పుణేలో న్యూ ఇంగ్లిష్ స్కూల్‌తో ప్రారంభించి, డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించి, అనంతరం ఫెర్గూసన్ కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా సమగ్ర విద్యా వ్యవస్థకు ఆయన పునాది వేశారని పేర్కొన్నారు. విద్య అసలు లక్ష్యం విజ్ఞానంతో మేధస్సును ప్రకాశవంతం చేయడమేనని తిలక్ మహారాజ్ విశ్వసించారని శ్రీ అమిత్ షా తెలిపారు. బ్రిటిష్ పాలకులు ఏ పత్రికలకు అత్యంత భయపడేవారంటే, అవి 'కేసరి' 'ది మరాఠా' పత్రికలేనని ఆయన అన్నారు.

ప్రజలలో ముందుగా జాతీయ చైతన్యాన్ని రగిలించకపోతే, స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికీ దానికి పెద్దగా విలువ ఉండదని మొదటగా స్పష్టం చేసింది తిలక్ మహారాజ్ అని శ్రీ షా గుర్తు చేశారు. సువ్యవస్థిత సంస్థలు, ప్రజల సంఘటిత శక్తి లేకుండా జాతీయ బలం ఎప్పటికీ సమకూరదని తిలక్ మహారాజ్ గట్టిగా చెప్పారని అన్నారు. అనేక ప్రజా ఉత్సవాల ద్వారా ఆయన మహారాష్ట్ర ప్రజలనే కాకుండా, దేశ వ్యాప్తంగా ఉన్న పౌరులను కూడా ఏకం చేశారని పేర్కొన్నారు. స్వావలంబన, క్రమశిక్షణ, దేశం పట్ల, రాజ్యాంగం పట్ల బాధ్యతాభావం కూడా స్వరాజ్యంలో అంతర్భాగాలేనని ఆయన తెలిపారు. తిలక్ మహారాజ్ జీవితం, ఆలోచనలు, రచనలు యువతకు, కౌమారప్రాయంలో ఉన్నవారికి నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

నేడు శ్రీ అజిత్ దోవల్ 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని' అందుకున్నారని తెలిపారు. అవార్డు అనేది కేవలం ఒక పతకం మాత్రమే కాదని; అది ప్రజలను ప్రోత్సహించడానికి, విశిష్ట వ్యక్తుల అసాధారణ సహకారాన్ని గుర్తించడానికి ఒక సాధనమని ఆయన అన్నారు. సమాజంలోని ఏ రంగంలోనైనా ఒక వ్యక్తి అసాధారణమైన సహకారాన్ని అందించినప్పుడు, ఆయన కేవలం ఒక వ్యక్తిగా మాత్రమే మిగిలిపోకుండా, ఎంతో ఎత్తుకు ఎదిగి తరతరాలకు నిరంతర స్ఫూర్తిదాతగా మారతారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తులను గౌరవించడం సమాజం బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ఆలా చేయడం ద్వారా సమాజం తన కర్తవ్యాన్నే కాకుండా, అలాంటి ఆదర్శప్రాయమైన వ్యక్తులను అనుసరించేలా ఇతరులకూ స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. శ్రీ అజిత్ దోవల్‌కు 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని' ప్రదానం చేయడం దేశ సేవలో జీవిస్తూ, పనిచేస్తున్న ప్రతి పౌరుడికి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని శ్రీ అమిత్ షా అన్నారు.

గుజరాత్ లో వరుస బాంబు పేలుళ్లు జరిగిన సమయంలో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ నరేంద్ర మోదీ - కేవలం ఆ బాంబు పేలుళ్లను మాత్రమే కాకుండా, వాటితో సంబంధం ఉన్న వ్యక్తులను, దేశవ్యాప్తంగా జరిగిన అన్ని బాంబు పేలుళ్లను విచారించాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించారని శ్రీ షా తెలిపారు. ఆ విచారణను నిర్వహించడంలో గుజరాత్ పోలీసులతో కలిసి పనిచేయడానికి శ్రీ అజిత్ దోవల్‌ను పిలిపించాలని అప్పట్లో శ్రీ మోదీ ఆదేశించారని హోం మంత్రి తెలిపారు. ఫలితంగా, గుజరాత్ పోలీసులు సమన్వయ విచారణ ద్వారా అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్లనే కాకుండా, దేశవ్యాప్తంగా జరిగిన 13 బాంబు పేలుళ్ల కేసులను ఛేదించడంలో విజయం సాధించారని ఆయన చెప్పారు.

శ్రీ నరేంద్ర మోదీ పాలనాకాలాన్ని చరిత్రగా రాసి, దేశ అంతర్గత, బాహ్య భద్రతను అంచనా వేసిన ప్రతిసారీ శ్రీ అజిత్ దోవల్ అందించిన సహకారానికి సంబంధించి ఒక సువర్ణాధ్యాయం తప్పక ఉంటుందని శ్రీ షా తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత విదేశాంగ విధానం మరింత బలోపేతమైందని, ప్రపంచ దేశాల మధ్య మన దేశం ఎంతో గౌరవ మర్యాదలతో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ ఈ ఘనతలో శ్రీ అజిత్ దోవల్ అపారమైన సహకారాన్ని అందించారని శ్రీ అమిత్ షా అన్నారు.

1972 నుంచి ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ అయ్యేంత వరకు శ్రీ అజిత్ దోవల్ ఒక నిబద్ధత కలిగిన అధికారిగా సేవలందించారని, దేశం ఎదుర్కొన్న ప్రతి ప్రధాన భద్రతా సవాలును పరిష్కరించడంలో క్రియాశీలక పాత్ర పోషించారని హోం మంత్రి తెలిపారు. ఈశాన్య భారతం, సిక్కిం, జమ్మూకాశ్మీర్, పంజాబ్, పాకిస్తాన్‌లలో సేవలందిస్తున్నప్పుడు శ్రీ దోవల్ అసాధారణమైన సహకారాన్ని అందించారని, ఆ సేవలను మాటల్లో వర్ణించలేమని లేదా అంచనా వేయలేమని ఆయన అన్నారు

. శ్రీ అజిత్ దోవల్ ఎంతో కీలకమైన కాలంతో సహా ఆరు సంవత్సరాల పాటు పాకిస్తాన్‌లో సేవలందించి, దేశ భద్రతకు అమూల్యమైన సహకారాన్ని అందించారని ఆయన పేర్కొన్నారు.

2019 తర్వాత, మోదీ ప్రభుత్వం మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎంఏసీ) ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేసిందని, ఈ రోజు ఇది దేశ అంతర్గత భద్రతకు వెన్నుముకగా నిలుస్తోందని శ్రీ అమిత్ షా తెలిపారు. ఎంఏసీ కి బలమైన పునాది వేసింది శ్రీ అజిత్ దోవలేనని ఆయన పేర్కొన్నారు. 2014లో శ్రీ నరేంద్ర మోదీ భారత ప్రధాని అయినప్పుడు శ్రీ అజిత్ దోవల్‌ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించారని శ్రీ షా మరింతగా చెప్పారు. అంతేకాకుండా, దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పనిచేసిన జాతీయ భద్రతా సలహాదారుగా కూడా శ్రీ దోవల్ ప్రత్యేక గుర్తింపు పొందారని ఆయన అన్నారు.

శ్రీ అజిత్ దోవల్ జాతీయ భద్రతా సలహాదారుగా బాధ్యతలు నిర్వర్తించిన కాలంలో, భారత సాయుధ బలగాలను ఆధునీకరించడానికి, సమకాలీన సంస్కరణలను తీసుకురావడానికి, సైన్యంలో సాంకేతికతను శౌర్యంతో అద్భుతంగా సమ్మిళితం చేయడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ప్రధాని మోదీ తీసుకున్న అనేక నిర్ణయాలకు రూపుదిద్దడంలో శ్రీ దోవల్ సుదీర్ఘ అనుభవం ఎంతగానో దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ భారత సాయుధ బలగాల రక్షణ సామర్థ్యాలను, దాడి చేసే వారి సన్నాహక శక్తిని బలోపేతం చేయడంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, ఈ ఘనత సాధించడంలో శ్రీ అజిత్ దోవల్ విశేషమైన సహకారాన్ని అందించారని తెలిపారు.

అన్నాభావు సాఠే జయంతి సందర్భంగా శ్రీ అమిత్ షా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# శేషు కుమార్ సేవలకు ట్రస్మా ఘన నివాళి

## -బడ్జెట్ స్కూళ్లకు అండగా నిలిచిన శేషు కుమార్‌కు ఘన నివాళి
## -నాలుగో వర్ధంతి సభలో స్ఫూర్తిదాయక సేవలను స్మరించిన ట్రస్మా నాయకులు




ఖమ్మం, ఆగష్టు 3:బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన దివంగత ట్రస్మా రాష్ట్ర నాయకుడు సూరపనేని శేషు కుమార్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం ఖమ్మం నగరంలోని ట్యాంక్‌బండ్ గెరిల్లా ఫంక్షన్ హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన స్మారక సభలో వారు మాట్లాడారు.

శేషు కుమార్ బడ్జెట్ స్కూళ్ల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని, ఆయన చూపిన మార్గం ప్రైవేటు విద్యాసంస్థలకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యా రంగానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

సభ ప్రారంభంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు శేషు కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ట్రస్మా ఆధ్వర్యంలో 'మేనేజ్‌మెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న ఇనుగంటి ప్రసాద్‌రావు, కాకర్ల బాలప్రసన్న భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలతో పాఠశాల నిర్వహణ అంశంపై ప్రజెంటేషన్లు ఇచ్చారు.

ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, అధ్యాపకుల కుటుంబాలకు ట్రస్మా తరఫున చెరో రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, ఐ.వి. రమణరావు, కేసి వీరన్న, శశిధర్ రెడ్డి, శంకరయ్య, ప్రవీణ్, ఇస్మాయిల్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి నాసరయ్య, అడ్వైజర్ సంక్రాంతి రవికుమార్, టీవీ అప్పారావు, మతిన్, సూరిబాబు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పూర్వ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పెద్ద సంఖ్యలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సభకు హాజరయ్యాయి.

# వైటీపీఎస్ ఎదుట భూ నిర్వాసితుల ధర్నా..

నల్లగొండ ఆగష్టు 3: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) ఎదుట సోమవారం ప్లాంట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన కుటుంబాలు ఆందోళన చేపట్టాయి.

వైటీపీఎస్ పరిధిలోని తాళ్లవీరప్పగూడెం, వీర్లపాలెం, తిమ్మాపురం, నరసాపురం, కల్లేపల్లి గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు ప్లాంట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

ప్లాంట్ నిర్మాణం కోసం భూములు స్వాధీనం చేసుకున్న సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. భూములు కోల్పోవడంతో జీవనోపాధి దెబ్బతిన్న తమకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు న్యాయం చేయాలని కోరారు.

# నీట్ - పీజీ 2026 పరీక్షల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా సమీక్ష

న్యూఢిల్లీ, ఆగష్టు 3:2026 ఆగస్టు 30న జరగనున్న 'నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్' (నీట్ - పీజీ) 2026 పరీక్షనుసజావుగా, సురక్షితంగా, పారదర్శకంగా సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించడానికి వీలుగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా ఈరోజు పరీక్ష సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్ష సందర్భంగా జాతీయ వైద్య పరీక్షల బోర్డు (ఎన్బీఈఎంఎస్), సాంకేతిక భాగస్వాములు, పరీక్ష నిర్వహణలో ఇతర భాగస్వాముల సంసిద్ధత గురించి మంత్రి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు (రవాణా), అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా వ్యవస్థ, నీట్ - పీజీ 2026 కోసం ప్రవేశపెట్టిన సాంకేతిక ఆధారిత సంస్కరణల గురించి అధికారుల బృందం వివరాలను మంత్రికి అందించింది.

పరీక్షల అత్యున్నత ప్రమాణాలు, సమగ్రత భద్రతను కాపాడుతూ, నిష్పాక్షికమైన, పారదర్శకమైన, అభ్యర్థులకు అనుకూలమైన వాతావరణంలో పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

నీట్ - పీజీ 2026 కోసం 2,73,183మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు, ఇది క్రితం సంవత్సరంతో పోలిస్తే 12.5% ఎక్కువ. దేశవ్యాప్తంగా అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల అందుబాటును గణనీయంగా పెంచుతూ, దాదాపు 340 నగరాలు, 1,300 పైగా పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించనున్నారు.

నీట్ -పీజీ 2026 పరీక్షకు సంబంధించి వదంతులు లేదా మోసపూరిత ప్రచారాలను నమ్మవద్దని కేంద్ర మంత్రి శ్రీ నడ్డా, అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. పరీక్ష ప్రారంభానికి కొద్దిసమయం ముందే అత్యంత సురక్షితమైన, రహస్య కోడ్, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రక్రియ ద్వారా తుది ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రశ్నపత్రం గోప్యతను పరీక్ష ప్రారంభ సమయం వరకు కాపాడేందుకు బహుళ స్థాయి సాంకేతిక, కార్యాచరణ భద్రతా వ్యవస్థలు అమల్లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల పరీక్షకు ముందే ప్రశ్నపత్రం తమ వద్ద ఉందని ఎవరైనా ప్రచారం చేస్తే అది పూర్తిగా అవాస్తవమని, అభ్యర్థులను తప్పుదోవ పట్టించేందుకే అలా చేస్తారని శ్రీ నడ్డా స్పష్టం చేశారు. ఎన్బిఇఎమ్ఎస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసే అధికారిక నివేదికలను మాత్రమే అభ్యర్థులు నమ్మాలని, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు లేదా అక్రమ పద్ధతుల ప్రయత్నాలు జరిగినా వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన సలహా ఇచ్చారు.

పరీక్షా కేంద్రాల ఎంపిక సౌలభ్యం: అభ్యర్థులు మూడు రాష్ట్రాల ప్రాధాన్యతలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా, అభ్యర్థులు తాము నివసిస్తున్న ప్రాంతానికి (చిరునామాకు) సమీపంలో ఉన్న పరీక్షా కేంద్రాల కోసం తమ సంప్రదింపుల చిరునామా ఉన్న రాష్ట్రాన్ని తప్పనిసరిగా మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాల్సి ఉంటుంది.

అభ్యర్థులకు మెరుగైన సౌకర్యం: పరీక్ష రాసే నగరం వివరాల సమాచారాన్ని పరీక్షకు దాదాపు మూడు వారాల ముందే విడుదల చేస్తారు. దీనివల్ల అభ్యర్థులు తమ ప్రయాణ, వసతి ఏర్పాట్లను ముందస్తుగా, సౌకర్యవంతంగా ప్రణాళిక చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

పరీక్షా సరళిలో మెరుగుదల: పరీక్షా సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రశ్నల సంఖ్యను 180కి కుదించి, సమయాన్ని 210 నిమిషాలుగా నిర్ణయించారు. దీనివల్ల మొత్తం పరీక్ష వ్యవధి మారకుండానే, అభ్యర్థులకు ఒక్కో ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ఎక్కువ సమయం లభిస్తుంది.

పటిష్ట ప్రామాణీకరణ: అప్లికేషన్ ప్రక్రియలోనూ. పరీక్ష రోజున కూడా ఆధార్-ఆధారిత ప్రామాణీకరణను అంతర్భాగం చేశారు. వేలిముద్రల గుర్తింపు విఫలమైన చోట, ఐరిస్ బయోమెట్రిక్ తనిఖీని ఉపయోగిస్తారు. ఇది పరీక్ష ప్రక్రియ పారదర్శకతను, సమగ్రతను మరింత బలపరుస్తుంది.

పరీక్ష నిర్వహణ కోసం అమలు చేస్తున్న సమగ్ర భద్రతా ఏర్పాట్లను కూడా కేంద్ర మంత్రి సమీక్షించారు. ఇందులో పరీక్షా కేంద్రాలను ముందస్తుగా సీలు చేసి ధ్రువీకరించడం, సీసీటీవీ నిఘా, బయోమెట్రిక్ ధ్రువీకరణ, అభ్యర్థుల శరీర తనిఖీ, సిగ్నల్ జామర్ల ఏర్పాటు, డైనమిక్ కంప్యూటర్ కేటాయింపు, కేంద్ర, ప్రాంతీయ కమాండ్ సెంటర్ల ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ, స్వతంత్ర పరిశీలకులు, మూల్యాంకన అధికారుల ద్వారా నిరంతర పర్యవేక్షణ వంటి పటిష్ట భద్రతా చర్యలు ఉన్నాయి. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా 60 వేల మందికి పైగా పరీక్ష నిర్వహణ సిబ్బందిని నియమించనున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రశ్నపత్రం తయారీ నుంచి పరీక్షా కేంద్రాలకు చేరవేసే వరకు మొత్తం ప్రక్రియను మరింత పటిష్టంగా రూపొందించారు. ఇందుకోసం బహుళ స్థాయిల రహస్య కోడ్ (ఎన్‌క్రిప్షన్), సురక్షిత ఆఫ్‌లైన్ విధానంలో ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష ప్రారంభానికి కొద్దిసమయం ముందే తుది ప్రశ్నపత్రాన్ని ఖరారు చేయడం, నిర్ణయించిన పరీక్ష ప్రారంభ సమయానికే నియంత్రిత డిజిటల్ డీక్రిప్షన్ ద్వారా ప్రశ్నపత్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి కట్టుదిట్టమైన భద్రతా చర్యలను అమలు చేస్తారు.

పరీక్షల నిర్వహణలో పారదర్శకతను మరింత బలోపేతం చేయడంతో పాటు అక్రమాలను అరికట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ ప్రత్యేక ఈ-మెయిల్ చిరునామాను అందుబాటులోకి తీసుకువచ్చింది. పరీక్షలో ఇతరుల స్థానంలో హాజరుకావడం, దళారుల కార్యకలాపాలు, ఇతర అక్రమాలపై ఈ ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తోంది. అభ్యర్థుల్లో అవగాహన, అప్రమత్తత పెంపొందించేందుకు ఎన్‌బీఈఎంఎస్ ఎప్పటికప్పుడు సూచనలు, హెచ్చరికలు కూడా జారీ చేస్తోంది. పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రతి అభ్యర్థికి సజావుగా, సురక్షితంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష నిర్వహణ జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్య ప్రవేశ పరీక్షలను అత్యున్నత స్థాయి పారదర్శకత, నిష్పాక్షికత, సాంకేతిక పటిష్టతతో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిలా శ్రీవాస్తవ, ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ లోవెనీష్ జి. కృష్ణ, ఎన్‌బీఈఎంఎస్ అధ్యక్షుడు డాక్టర్ అభిజాత్ షేత్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ వినోద్ కొత్వాల్, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ శ్రీ కుమార్ రాహుల్, ఎన్ఎంసీ కార్యదర్శి డాక్టర్ రాఘవ్ లాంగర్, ఎన్‌బీఈఎంఎస్ గౌరవ కార్యనిర్వాహక డైరెక్టర్ డాక్టర్ మీను బాజ్‌పాయ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

### -చికిత్స పొందుతూ ఆస్పత్రిలో కన్నుమూత



నిజామాబాద్, ఆగష్టు 3: ఎడపల్లి మండలానికి చెందిన షేక్ బాషా (50) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు.

ఈ నెల 29న సాయంత్రం సాటాపూర్ గేట్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో షేక్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున 12:30 గంటలకు ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి భార్య వాజిదా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ముత్యాల రమ వెల్లడించారు.

# గ్రామంలో మద్య విక్రయాలపై కఠిన నిర్ణయం

## -బెల్ట్ షాపులు నిర్మూలనకు గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం



మహబూబ్‌నగర్, ఆగష్టు 3:మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని రామచంద్రపురం గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థులు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సర్పంచ్ వై. నర్సిములు (బాబురావు) ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

గ్రామంలో మద్యం విక్రయాల కారణంగా యువత చెడు మార్గంలోకి వెళ్లడం, విద్యార్థులు చదువులకు దూరమై కుటుంబాలకు భారంగా మారుతున్నానే అంశాన్ని గ్రామస్థులు ఇటీవల సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మహిళా సంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించి సమస్యపై చర్చించారు.

సమావేశంలో గ్రామంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే రూ.50 వేల జరిమానా విధించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారి వివరాలను అధికారులకు లేదా గ్రామ పెద్దలకు తెలియజేసిన వారికి రూ.10 వేల నగదు బహుమతి ఇవ్వాలని నిర్ణయించారు.

గ్రామాన్ని మద్యరహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తు దృష్ట్యా ఈ నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వై. నర్సిములు (బాబురావు), ఉపసర్పంచ్ కేశవానంద్, వార్డు సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి

## -రైతుల ప్రయోజనాల కోసం ఎంఎస్పీకి చట్టబద్ధ హామీ కల్పించాలని డిమాండ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 3:అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ వంటి దేశాలతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు.

ఆదివారం అచ్చంపేట పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని పీవీ రావు భవన్‌లో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి, దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. పత్తిపై దిగుమతి సుంకం తగ్గించడం వల్ల దేశీయ పత్తి ధరలు పడిపోతుండగా, కార్పొరేట్ సంస్థలకే లాభాలు చేకూరుతున్నాయని విమర్శించారు.

రైతులకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) అమలు చేయాలని కోరారు. అలాగే ఎంఎస్పీకి చట్టబద్ధ హామీ, రుణ విమోచన చట్టం, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం, పంట బీమా, సులభ రుణ సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గ్రామగ్రామాన ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# అనాడు కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులే నేడు రైతులకు శ్రీరామరక్ష

నిజామాబాద్, ఆగష్టు 3: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు, వరద కాలువ వంటి సాగునీటి ప్రాజెక్టులే నేడు రైతులకు శ్రీరామరక్షగా నిలిచాయని వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు.

ఆదివారం నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించడం ఆ పార్టీ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ ప్రక్రియ వల్ల శ్రీరాంసాగర్ ఆయకట్టు రైతులకు సాగు నీరు అందడంతో పాటు చెరువులు నిండుతున్నాయని, భూగర్భ జలాలు పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో రైతులకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతోందన్నారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వరద కాలువ ద్వారా నీటిని అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు ఈ ప్రక్రియకు కృషి చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# మోడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసుల కొరడా..




ఖమ్మం, ఆగష్టు 3: మోడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దం చేస్తూ తిరుగుతున్న ద్విచక్ర వాహనాలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో 12 ద్విచక్ర వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లతో నడుస్తున్నట్లు గుర్తించారు. ఆ వాహనదారులపై మోటారు వాహనాల చట్టం?1988లోని సెక్షన్ 190(2) ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. అనంతరం వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మోడిఫైడ్ సైలెన్సర్ల వల్ల తీవ్రమైన శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఇటువంటి మార్పులు చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. వాహనదారులు కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లనే వినియోగించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# దేశవ్యాప్తంగా డీఆర్ఐ మెగా ఆపరేషన్: భారీగా బంగారం, మత్తు పదార్థాలు, ఈ-సిగరెట్ల స్వాధీనం... అయిదుగురు విదేశీయులతో సహా 20 మంది అరెస్టు



న్యూఢిల్లీ, ఆగష్టు 3:వ్యవస్థీకృత స్మగ్లింగ్ వ్యవస్థలు, సరిహద్దు దాటే అక్రమ రవాణా ముఠాలపై నిరంతర నిఘాలో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఈ వారం దేశవ్యాప్తంగా పలు నిఘా ఆధారిత ప్రత్యేక దాడులను నిర్వహించింది. ఈ ఆపరేషన్లలో విదేశీ బంగారం, హెరాయిన్, ఎండీఎంఏ, హైడ్రోపోనిక్ గంజాయి, ఎర్రచందనం, నిషేధిత వన్య ప్రాణి ఉత్పత్తులు, ఈ-సిగరెట్లు, విదేశీ గసగసాలు, పోకచెక్కలను భారీగా స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణా, స్మగ్లింగ్ కార్యకలాపాల్లో భాగస్వాములైన అయిదుగురు విదేశీయులతో పాటు మొత్తం 20 మంది నిందితులను అధికారులు అరెస్టు చేశారు. క్రిమినల్ ముఠాలు నిషేధిత వస్తువులను దాచడానికి ఉపయోగించిన అత్యంత సంక్లిష్టమైన, ఆధునికమైన దాచే పద్ధతులను ఈ తనిఖీల్లో డీఆర్ఐ అధికారులు బహిర్గతం చేశారు.

న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 29.07.2026న డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు నిర్వహించిన ప్రధాన ఆపరేషన్‌లో దుబాయ్ నుంచి వచ్చిన ఇద్దరు విదేశీయులను అడ్డుకున్నారు. ప్రయాణికుల ట్రాలీని తనిఖీ చేయగా, ట్రాలీ పరిమాణానికి తగినట్లుగా స్టీల్ షీట్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన రహస్య గదిని అధికారులు గుర్తించారు. ఆ రహస్య గది నుంచి 4 కిలోల బరువున్న 40 విదేశీ బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ బంగారాన్ని జప్తు చేసి, ఇద్దరు ప్రయాణికులను అరెస్టు చేశారు.

అంతకుముందు అదే వారంలో భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో డీఆర్ఐ, సరిహద్దు భద్రతా దళ సిబ్బంది (బీఎస్ఎఫ్) బలగాలు సంయుక్తంగా నిర్వహించిన వేర్వేరు ఆపరేషన్లలో సుమారు 3.2 కిలోల విదేశీ బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తుంగిలోని సరిహద్దు ఫెన్సింగ్ వద్ద ఒకరి నుంచి, హిలీ సరిహద్దు గేట్ వద్ద మరొకరి నుంచి, నిత్యానందకటి, హాకింపూర్ సమీపంలో అడుకున్న మోటార్ సైకిల్‌పై ఉన్న వ్యక్తి నుంచి ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ స్వాధీనాలకు సంబంధించి ఒక మహిళతో సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు.

పై కేసులతో పాటు వారణాసి ఢిల్లీ విమానాశ్రయం, తమిళనాడుల్లో నిర్వహించిన మూడు వేర్వేరు ఆపరేషన్లలో డీఆర్ఐ అధికారులు సుమారు 2.2 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు.

రవాణాపై నిషేధం ఉన్న వస్తువుల దిగుమతికి సంబంధించిన మరో ముఖ్యమైన కేసులో సుమారు రూ. 1.4 కోట్ల విలువైన 14 మెట్రిక్ టన్నుల పాకిస్తాన్ రకానికి చెందిన గుగ్గిలం దిగుమతి యత్నాన్ని డీఆర్ఐ అధికారులు బట్టబయలు చేశారు. ఈ సరుకు వివరణను, ఉత్పత్తి చేసిన దేశం పేరును తప్పుగా ప్రకటించి తీసుకు రావడానికి ప్రయత్నించారు. సోమాలియా నుంచి వస్తున్న సహజమైన రెసిన్ (జిగురు) అని, దుబాయ్ మార్గంలో పంపుతున్నామని తప్పుడు ప్రకటనలు ఇచ్చారు.

భారత్, పాకిస్తాన్ శుష్క (ఎడారి) ప్రాంతాల్లో మాత్రమే పెరిగే గుగ్గిలం (క్యామిఫోరా రెసిన్) రకం సీఐటీఈఎస్ అనుబంధం ఎపి జాబితాలో ఉంది. ఇది ఐయూసీఎన్ రెడ్ లిస్ట్‌లో తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్న జాతిగా వర్గీకరించారు. విచారణలో ఆ సరుకు పాకిస్తాన్ మూలాలు ఉన్న గుగ్గిలం అని, నకిలీ పత్రాలను ఉపయోగించి దారి మళ్లించి తీసుకువచ్చారని నిర్ధారణ అయింది. పాకిస్తాన్ నుంచి నేరుగా లేదా పరోక్షంగా ఉత్పత్తుల దిగుమతిని నిషేధించే డీజీఎఫ్‌టీ నిబంధనలకు విరుద్ధంగా ఈ దిగుమతి జరిగింది. ఈ కుట్రలో భాగస్వాములైన ఇద్దరు వ్యక్తులను అధికారులు అరెస్టు చేశారు.

మరో ప్రధాన వన్యప్రాణి, అటవీ ఉత్పత్తుల అక్రమ రవాణా కేసులో, చెన్నై శివార్లలో ఒక ట్రక్కును డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. ఖాళీ ప్లాస్టిక్ క్రేట్ల వెనుక దాచిన 142 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి బరువు సుమారు 4.8 మెట్రిక్ టన్నులు ఉంటుంది. ఎర్రచందనం అనేది సీఐటీఈఎస్ అనుబంధం ఎపి, వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద రక్షణ పొందుతున్న జాతి. స్వాధీనం చేసిన ఈ సరుకు విలువ సుమారు రూ. 2.50 కోట్లు ఉంటుంది. గతంలో అక్రమ ఎగుమతులు చేసిన చరిత్ర ఉన్న ఒక సంఘటిత స్మగ్లింగ్ వ్యవస్థ హస్తం దీని వెనుక ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు.

మయన్మార్ నుంచి సరిహద్దుల గుండా జరుగుతున్న మత్తు పదార్థాల అక్రమ రవాణాపై అందిన కచ్చితమైన సమాచారంతో మణిపూర్‌లోని చూరాచంద్‌పూర్ సమీపంలో ఒక వాహనాన్ని డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. అస్సాం రైఫిల్స్, మణిపూర్ పోలీసుల సహాయంతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో 220 సబ్బుల పెట్టెల్లో దాచిన సుమారు 2.7 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

ముంబైలో నిర్వహించిన వేర్వేరు రెండు ఆపరేషన్లలో ఢిల్లీ నుంచి ప్రయాణిస్తున్న ఇద్దరు విదేశీ మహిళలను డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. వారి లగేజీ సంచులలో ప్రత్యేకంగా తయారు చేసిన రహస్య అరల్లో దాచిన సింథటిక్ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సుమారు 2 కిలోల యాంఫెటమైన్ క్రిస్టల్స్, ఎండీఎమ్ఏ టాబ్లెట్లను జప్తు చేశారు. ఎన్‌డీపీఎస్ చట్టం 1985 కింద ఆ ఇద్దరు ప్రయాణికులను అరెస్టు చేశారు.న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో, డీఆర్ఐ అధికారులు ఒక విదేశీయుడితో సహా ఇద్దరు ప్రయాణికులను అడ్డగించి, వారి వద్ద నుంచి సుమారు 25 కిలోల హైడ్రో పోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి ప్రయాణించిన ఈ ఇద్దరు ప్రయాణికులను అరెస్టు చేశారు.

నిషేధిత వస్తువుల అక్రమ దిగుమతిని అరికట్టే లక్ష్యంతో చేపట్టిన మరో ఆపరేషన్‌లో నవషేవా ఓడరేవు వద్ద ఒక దిగుమతి సరుకును డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. ఎల్ఈడీ లైట్లు, ఫిక్చర్లుగా తప్పుడు ప్రకటన ఇచ్చిన ఆ సరుకును తనిఖీ చేయగా, వివిధ బ్రాండ్లు, ఫ్లేవర్లకు చెందిన 9,230 నిషేధిత ఎలక్ట్రానిక్ సిగరెట్లు బయటపడ్డాయి. ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిరోధక చట్టం 2019 ప్రకారం భారత్‌లో ఈ-సిగరెట్లపై పూర్తి నిషేధం ఉంది. ఆ కార్గో తో పాటు నిషేధిత ఈ-సిగరెట్లను అధికారులు జప్తు చేశారు. స్వాధీనం చేసిన ఈ మొత్తం సరుకు విలువ సుమారు రూ. 3.70 కోట్లు ఉంటుంది.

మిజోరంలో భారత్- మయన్మార్ సరిహద్దు సమీపంలో ఉన్న నాలుగు అనుమానాస్పద గోదాములపై డీఆర్ఐ అధికారులు అస్సాం రైఫిల్స్ బలగాల సహాయంతో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విదేశీ మూలాలు ఉన్న సుమారు 14.5 మెట్రిక్ టన్నుల గసగసాలు, 14 మెట్రిక్ టన్నుల పోకచెక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 3.6 కోట్లు ఉంటుంది. భారత్-మయన్మార్ సరిహద్దులోని జోఖావ్‌థార్ సెక్టార్ గుండా ఈ వస్తువులను భారత్‌లోకి అక్రమంగా తరలించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కస్టమ్స్ చట్టం 1962 ప్రకారం ఈ సరుకును జప్తు చేశారు.

విదేశీ వాణిజ్య విధానం ప్రకారం గసగసాలు నియంత్రిత వస్తువుల జాబితా కిందకు వస్తాయి. నిర్దేశిత దేశాల నుంచి చట్టబద్ధంగా సాగు చేసిన పంట ను మాత్రమే దిగుమతి చేసుకోవడం, గ్వాలియర్ నార్కోటిక్స్ కమిషనర్ వద్ద అన్ని దిగుమతి కాంట్రాక్టులను తప్పనిసరిగా నమోదు చేసుకోవడం వంటి నిర్దిష్ట నిబంధనలకు లోబడి మాత్రమే వీటి దిగుమతికి అనుమతి ఉంటుంది.

# రక్షణ అకౌంట్ల కంట్రోలర్ జనరల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి అల్కా నాంగియా అరోరా

న్యూఢిల్లీ, ఆగష్టు 3:రక్షణ అకౌంట్ల కంట్రోలర్ జనరల్ (సీజీడీఏ)గా శ్రీమతి అల్కా నాంగియా అరోరా ఈ రోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీమతి అల్కా నాంగియా అరోరా ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ (ఐడీఏఎస్)కు చెందిన 1991 బ్యాచ్ ఆఫీసరు.

డెహ్రాడూన్ లోని గఢ్‌వాల్ విశ్వవిద్యాలయంతో పాటు ఐఐటీ రూర్కీ పూర్వ విద్యార్థిని అయిన శ్రీమతి అరోరా.. కేంద్ర ప్రభుత్వంలో అనేక కీలక పదవులను నిర్వహించారు. ఆ పదవులలో.. వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన వ్యవసాయ పరిశోధన, విద్య విభాగం (డీఏఆర్ఈ)లో అదనపు కార్యదర్శి, ఆర్థిక సలహాదారు; సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల మంత్రిత్వశాఖలో సంయుక్త కార్యదర్శి; సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ మేనేజింగ్ డైరెక్టరు; జౌళి మంత్రిత్వశాఖలో హస్తకళల అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనరు వంటివి ఉన్నాయి. రక్షణ రంగ ఆర్థిక నిర్వహణ, ప్రజా సేవ రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న శ్రీమతి అల్కా నాంగియా అరోరా .. హస్తకళల ప్రోత్సాహం, వ్యవసాయ పరిశోధన, కొనుగోలు విధానం, పబ్లిక్ ఫైనాన్స్‌లతో ముడిపడిన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. ఐఐఎమ్ బెంగళూరు, ఐఎస్‌బీ మొహాలీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలలో ఉన్నత స్థాయి శిక్షణనూ పూర్తి చేశారు.

శ్రీమతి అల్కా నాంగియా తన కెరియంను రక్షణ శాఖలో ప్రారంభించి, కోల్‌కతాలోని డమ్ డమ్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహించారు. తరువాత డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ (డీఏడీ)లో కీలక పదవీబాధ్యతలను నిర్వహించారు. మూడు సాయుధ దళాలతోనూ కలిసి, విస్తృత అనుభవాన్ని సొంతం చేసుకున్నారు. ముంబయిలోని నావల్ డాక్‌యార్డులో అడ్మిరల్ సూపరింటెండెంట్ (ఏఎస్‌డీ)కు ఆర్థిక సలహాదారు (ఎఫ్ఏ), కోల్‌కతాలో సైన్య ఈస్టర్న్ కమాండ్‌తో పటు ఏరియా అకౌంట్స్ ఆఫీస్ అధిపతికి ఎఫ్ఏ, వెస్టర్న్ ఎయిర్ కమాండ్ (డబ్ల్యూఏసీ), ఆర్మీ హాస్పిటల్ రిసర్చ్, రెఫరల్ (ఏహెచ్‌ఆర్ఆర్)కు ఏకీకృత ఆర్థిక సలహాదారు (ఐఎఫ్ఏ), వైమానిక దళ ప్రధానకేంద్రానికి ప్రిన్సిపల్ ఐఎఫ్ఏగా బాధ్యతలు నిర్వహించారు. రక్షణ ఖాతాల కంట్రోలర్ జనరల్ (సీజీడీఏ) ప్రధానకేంద్రంలో అదనపు సీజీడీఏ, స్పెషల్ సీజీడీఏగా కూడా శ్రీమతి అరోరా సేవలను అందించారు. ఈ క్రమంలో.. ఆడిట్, ఐటీ, సిస్టమ్స్, ఏకీకృత ఆర్థిక సలహాదారు (ఐఎఫ్ఏ), శిక్షణలకు సంబంధించిన విధానాల అమలులో శ్రీమతి అరోరా ముఖ్య పాత్రను పోషించారు.

# రూప్ల తండా, రాందాస్ తండా పాఠశాలలకు విద్యాసామాగ్రి పంపిణీ



ఖమ్మం, ఆగష్టు 3: తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, విద్యానగర్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) ఆధ్వర్యంలో సోమవారం చుంచుపల్లి మండలం రూప్ల తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రాందాస్ తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్స్, రబ్బర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటికే 8 ప్రభుత్వ పాఠశాలలకు విద్యాసామగ్రి అందజేశామని, ప్రస్తుతం ఈ రెండు పాఠశాలలతో కలిపి మొత్తం 10 పాఠశాలలకు సహాయం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేస్తే, రాబోయే సంవత్సరాల్లో మరింత ఉత్సాహంతో విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందించేందుకు అసోసియేషన్ ముందుంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సీతారామశాస్త్రి, రామిరెడ్డి, రషీద్, గ్రామ సర్పంచ్ బొజ్జ రామారావు, రూప్ల తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భావ్ సింగ్, రాందాస్ తండా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు అభినందిస్తూ, భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు.

# నౌకాదళ డిప్యూటీ చీఫ్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన వైస్ అడ్మిరల్ ఎ ఎన్ ప్రమోద్, ఏవీఎస్ఎమ్, వైఎస్ఎమ్

న్యూఢిల్లీ, ఆగష్టు 3:నౌకాదళ డిప్యూటీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ ఎ. ఎన్. ప్రమోద్, ఏవీఎస్ఎమ్, వైఎస్ఎమ్ ఈ రోజు పదవీబాధ్యతలు స్వీకరించారు.

గోవాలోని నౌకాదళ అకాడమీకి చెందిన 38వ ఏకీకృత కేడెట్ కోర్సు పూర్వ విద్యార్థి అయిన వైస్ అడ్మిరల్ ఎ. ఎన్. ప్రమోద్ 1990 జులై 1న భారతీయ నౌకాదళంలో చేరారు. ఈ ఫ్లాగ్ ఆఫీసర్ కేటగిరీ 'ఎ'కి చెందిన సీ కింగ్ ఎయిర్ ఆపరేషన్స్ అధికారి. అంతేకాక, కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్ యుద్ధ నిపుణుడు కూడా. వెల్లింగ్టన్‌లో గల డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కళాశాలలోనూ, గోవాలోని నౌకాదళ యుద్ధ కళాశాలలో నావల్ హయ్యర్ కమాండ్ కోర్సులోనూ ఈయన పూర్వ విద్యార్థి.

ఈ ఫ్లాగ్ ఆఫీసరు 36 సంవత్సరాలకు పైగా తన విశిష్ట కెరియర్‌లో.. సముద్రంలోనూ, సముద్రతీరంలోనూ కమాండ్, కార్యకలాపాలు, బోధన, సిబ్బందికి సంబంధించిన అనేక పదవులను నిర్వహించారు. నౌకాదళంలో ఆయన నిర్వహించిన కీలక పదవుల్లో.. గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ రాజ్‌పుత్ కు కార్యనిర్వహణ అధికారి, జలాంతర్గామి నిరోధక యుద్ధ గస్తీ నౌక ఐఎన్ఎస్ అభయ్, ల్యాండింగ్ షిప్ ట్యాంక్ (పెద్దది) ఐఎన్ఎస్ శార్దూల్, గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ సాత్పురాకు కమాండ్ వంటివి ఉన్నాయి. గల్వాన్ ఘటన అనంతరం 'ఆపరేషన్ స్నో లెపర్డ్' వేళ.. పశ్చిమ నౌకాదళ ఫ్లీట్ ఆపరేషన్స్ అధికారిగా కూడా ఈయన సేవలు అందించారు. 1999 నాటి 'ఆపరేషన్ విజయ్'లో, 2001 నాటి 'ఆపరేషన్ పరాక్రమ్'లో ఈ ఫ్లాగ్ ఆఫీసరు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో ఈ ఫ్లాగ్ ఆఫీసరు.. శ్రీ విజయ పురంలో నెలకొన్న నౌకాదళ వైమానిక స్టేషను ఐఎన్ఎస్ ఉత్క్రోశ్ కమాండ్ బాధ్యతలను నిర్వహించారు. వెల్లింగ్టన్‌లో డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కళాశాలలో డైరెక్టింగ్ స్టాఫ్‌గా సేవలను అందించారు. నౌకాదళ ప్రధాన కేంద్రంలో ఈయన నిర్వహించిన కీలక పదవుల్లో.. నౌకాదళ వైమానిక స్టాఫ్ జాయింట్ డైరెక్టరు, డైరెక్టరు పదవులే కాక, ఎయిర్‌క్రాఫ్ట్ అక్విజిషన్ ప్రిన్సిపల్ డైరెక్టరు పదవి వంటివి ఉన్నాయి. ఈయన 2006 నుంచి 2009 వరకూ వ్యూహరచనా సంబంధి ఆడిట్ గ్రూపులో సభ్యునిగా ఉండడమే కాక, 2016 నుంచి 2019 వరకూ భారతీయ నౌకాదళ వ్యూహాత్మక, యుద్ధ కార్యకలాపాల మండలిలో సభ్యునిగా కూడా ఉన్నారు.

రియర్ అడ్మిరల్ పదవికి పదోన్నతి లభించిన తరువాత, ఈయన భారతీయ నౌకాదళ అకాడమిలో డిప్యూటీ కమాండ్ అధికారి, నౌకాదళ సిబ్బంది (వైమానిక) అసిస్టెంట్ చీఫ్ పదవులనే కాక, మహారాష్ట్ర నావల్ ఏరియాకు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ అధికారి పదవిని కూడా నిర్వహించారు.

వైస్ అడ్మిరల్ పదవికి పదోన్నతిని పొందిన తరువాత, ఈయన 2023 డిసెంబరు 13 నుంచి నిన్నటి వరకూ.. అంటే 2026 జులై 31 వరకూ నౌకాదళ కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డీజీఎన్ఓ)గా సేవలు అందించారు. డీజీఎన్ఓగా ఈయన 'ఆపరేషన్ సిందూర్' కాలంలో భారతీయ నౌకాదళ ప్రణాళికరచన, సన్నాహకాలు, కార్యకలాపాల సన్నద్ధతలతో పాటు ప్రస్తుత పశ్చిమాసియయా సంక్షోభ కాలంలో సముద్ర భద్రత సంబంధిత కార్యకలాపాల నిర్వహణలో చురుకుగా పాలుపంచుకున్నారు.

ఈ ఫ్లాగ్ ఆఫీసరు అందించిన విశిష్ట సేవలకీ, కార్యకలాపాల నాయకత్వ భూమికకీ గుర్తింపునిస్తూ, 2024లో 'అతి విశిష్ట సేవా పతకం', 2025లో 'యుద్ధ సేవా పతకం'తో సత్కరించారు.

ఈయన.. వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తీ, యూవైఎస్ఎమ్, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎమ్ స్థానాన్ని స్వీకరిస్తారు. వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తీ, యూవైఎస్ఎమ్, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎమ్ 38 సంవత్సరాలకు పైగా విశిష్ట సేవలను అందించిన అనంతరం నిన్న అంటే 2026 జులై 31న పదవీ విరమణ చేశారు.

# ద్వైపాక్షిక వాణిజ్య విస్తరణతో పాటు, వ్యాపార సంస్థల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేయాలని నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగష్టు 3:భారత్ – రువాండా సంయుక్త వాణిజ్య కమిటీ (జేటీసీ) తొలి సమావేశం 2026 జూలై 30, 31 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగింది. భారత ప్రతినిధి బృందానికి వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అమిత్ కుమార్ నాయకత్వం వహించగా, రువాండా తరఫున ఆ దేశ విదేశీ వ్యవహారాలు, అంతర్జాతీయ సహకార మంత్రిత్వ శాఖలో ఆసియా, పసిఫిక్, మధ్యప్రాచ్య వ్యవహారాల డైరెక్టర్ జనరల్ శ్రీ వర్జిల్ ర్వాన్యగతారే ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు

వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి శ్రీ యశ్వీర్ సింగ్ ప్రారంభోపన్యాసం చేస్తూ, ఈ తొలి సమావేశం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సమీక్షించడం, వాణిజ్య ఉత్పత్తుల పరిధిని విస్తరించడం, పరస్పర పెట్టుబడులను పెంపొందించడం, రవాణా అంశాలకు సంబంధించిన అడ్డంకులను పరిష్కరించడం కోసం శాశ్వత, వ్యవస్థీకృత, నిర్దిష్ట వ్యవధిలో సమావేశమయ్యే అత్యున్నత స్థాయి యంత్రాంగాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు.

వస్తువులు, సేవల రంగాల్లో ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్య స్థితిని ఇరు దేశాల ప్రతినిధులు సమీక్షించారు. భారత్ నుంచి రువాండాకు ప్రధానంగా ఔషధ తయారీ ఉత్పత్తులు, జీవసంబంధిత ఉత్పత్తులు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, పారిశ్రామిక, విద్యుత్ యంత్రాలు, ఆయిల్ మీల్స్, ఇనుము – ఉక్కు ఉత్పత్తులు ఎగుమతి అవుతుండగా, రువాండా నుంచి భారత్‌కు సీసం, సుగంధ ద్రవ్యాలు, ముఖ్యమైన సుగంధ నూనెలు, రాగి, విలువైన, పాక్షిక విలువైన రత్నాలు, ప్రాసెసింగ్ చేసిన వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాలు దిగుమతి అవుతున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఉత్పత్తుల పరిధిని విస్తరించడం, వ్యాపార సంస్థల మధ్య ప్రత్యక్ష సహకారాన్ని ప్రోత్సహించడం, మార్కెట్ లభ్యతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఉమ్మడిగా కృషి చేయాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

భారీ ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలు, వైద్య పరికరాలు, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులు, వస్త్రాలు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్ వస్తువులు, క్రీడా సామగ్రి, బొమ్మలు, రత్నాలు – ఆభరణాలు, శాస్త్రీయ పరికరాల ఎగుమతులను మరింత విస్తరించే అవకాశాలను భారత్ ప్రస్తావించింది. రువాండా ఔషధ దిగుమతుల్లో సుమారు 24.5 శాతం వాటాతో భారత్ ఆ దేశానికి అతిపెద్ద ఔషధ సరఫరాదారుగా కొనసాగుతోందని సమావేశంలో పేర్కొన్నారు. భారత్‌కు చేసే ప్రాధాన్యత ఎగుమతులుగా మిరపకాయలు, మకాడమియా, ఫ్రెంచ్ బీన్స్, ఆవకాడో, అవసరమైన ఆయిల్స్, టీ, కాఫీ, ఇతర ఉద్యానవన ఉత్పత్తులు, ఖనిజాలు, విలువైన రాళ్లను రువాండా గుర్తించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్),, రువాండా స్టాండర్డ్స్ బోర్డ్ (ఆర్ ఎస్బీ) మధ్య సామర్థ్య పెంపుతో సహా, ప్రమాణాల ఏకీకరణపై పరస్పర సహకారం గురించి కూడా ఇరుపక్షాలు చర్చించాయి.

పెట్టుబడుల విషయంలో 2025 నాటికి భారత్ తమ దేశంలో రెండో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుగా నిలిచిందని రువాండా గుర్తించింది. గనుల రంగం, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, తక్కువ వ్యయంతో గృహ నిర్మాణం, సమాచార?సంబంధిత సాంకేతికత, తయారీ, ఆరోగ్య సేవలు, పర్యాటకం, ఆర్థిక సేవల రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. సంయుక్త వాణిజ్య కమిటీ (జేటీసీ) పరిధిలో పెట్టుబడుల సమన్వయ కేంద్రాలుగా ఇన్వెస్ట్ ఇండియా, రువాండా డెవలప్‌మెంట్ బోర్డును నియమించాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. వాణిజ్య ప్రదర్శనలు, వ్యాపార వేదికలు, కొనుగోలుదారులు – విక్రేతల సమావేశాల క్యాలెండర్లను పరస్పరం మార్పిడి చేసుకోవాలని అంగీకరించాయి. తూర్పు ఆఫ్రికా సమాజం (ఈఏసీ), తూర్పు, దక్షిణ ఆఫ్రికా ఉమ్మడి మార్కెట్ (కోమెసా), ఆఫ్రికన్ ఖండ స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతం (ఏఎఫ్‌సీఎఫ్‌టీఏ)లకు ప్రవేశ ద్వారంగా తమ దేశానికి ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని రువాండా ప్రస్తావించింది. దీని ద్వారా భారత వ్యాపార సంస్థలకు విస్తృత ప్రాంతీయ మార్కెట్లలోకి ప్రవేశించే అవకాశాలు లభిస్తాయని పేర్కొంది.

ఇరుపక్షాలు రంగాలు వారీగా సహకారం కోసం అనేక ప్రాధాన్యత ప్రాంతాలను గుర్తించాయి. కీలక ఖనిజాల రంగంలో రువాండాకు చెందిన టిన్, టంగ్‌స్టన్, టాంటాలమ్ వనరులపై పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి భారత్ ఆసక్తిని వ్యక్తం చేసింది. ఇందులో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, రువాండా మైన్స్, పెట్రోలియం అండ్ గ్యాస్ బోర్డ్ మధ్య సంస్థాగత సహకారం కూడా ఉంది. ఫార్మాస్యూటికల్స్, ఆరోగ్య సంరక్షణ రంగాలలో ఇరుదేశాల ఆరోగ్య శాఖల మధ్య అవగాహన ఒప్పందం ఆమోద ముద్ర పొందేందుకు చివరి దశలో ఉందని ఇరుపక్షాలు పేర్కొన్నాయి. ఇండియన్ ఫార్మాకోపియాకు గుర్తింపు ఇవ్వాలని, సాంప్రదాయ వైద్యంలో సహకారాన్ని విస్తరించాలని కూడా భారత్ ప్రతిపాదించింది.

వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, అవకాడోలకు మార్కెట్ లభ్యత, వస్త్రాలు, తోలు పరిశ్రమ, హరిత రవాణా, డిజిటల్ మౌలిక వసతులు, ఫిన్‌టెక్, సైబర్ భద్రత, పునరుత్పాదక ఇంధన రంగాల్లో సహకారంపై కూడా ఇరు పక్షాలు చర్చించాయి. భారత సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం (ఐటీఈసీ), స్టడీ ఇన్ ఇండియా కార్యక్రమం, స్కిల్ ఇండియా మిషన్ ద్వారా సామర్థ్యాభివృద్ధికి మద్దతును కొనసాగిస్తుందని భారత్ తెలిపింది. రువాండాలో సాంకేతిక, వృత్తి విద్యా శిక్షణ (టీవీఈటీ) వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కూడా సహకారం అందించనున్నట్లు పేర్కొంది.

చర్చలు స్నేహపూర్వక, నిర్మాణాత్మక వాతావరణంలో జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో ఇరు దేశాల ప్రతినిధి బృందాలు సాధించిన పురోగతిని వాణిజ్య శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ అభినందించారు. ఉమ్మడి అంగీకార సమావేశ మినిట్స్ లో నమోదు చేసిన నిర్ణయాలను నిరంతర పర్యవేక్షణతో, నిర్దిష్ట గడువులో అమలు చేయాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు.

ఇరు పక్షాలు అంగీకరించిన మినిట్స్ పై 2026 జూలై 31న న్యూఢిల్లీలో ఇరు దేశాల ప్రతినిధి బృందాలు సంతకాలు చేశాయి. ఏడాది అనంతరం దౌత్య మార్గాల ద్వారా పరస్పర అంగీకారంతో నిర్ణయించే తేదీన రువాండాలో భారత్ , రువాండా సంయుక్త వాణిజ్య కమిటీ రెండో సమావేశాన్ని నిర్వహించాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

## సమగ్ర సంక్షేమం, పెన్షన్ సంస్కరణల ద్వారా పదవీ విరమణానంతర సంరక్షణను బలోపేతం చేస్తున్న కోల్ ఇండియా

న్యూఢిల్లీ, ఆగష్టు 3:పదవీ విరమణ పొందిన తమ ఉద్యోగుల కోసం పెన్షన్ నిర్వహణ, ఆరోగ్య సంరక్షణ సదుపాయం, ఫిర్యాదుల పరిష్కారం, సామాజిక భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన అనేక సంస్కరణల ద్వారా... కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) తమ ఉద్యోగుల పదవీ విరమణానంతర సంక్షేమ వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేసింది. ఈ కార్యక్రమాలు 4.5 లక్షలకు పైగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, పెన్షన్‌దారుల జీవన నాణ్యతనూ మెరుగుపరిచాయి. దేశ ఇంధన భద్రతకు దోహదపడిన వారి సంక్షేమం పట్ల కంపెనీ నిబద్ధతను ఇది పునరుద్ఘాటిస్తోంది.

కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సహకారంతో, సి-కేర్స్ వేదిక ద్వారా సీఐఎల్... పెన్షన్ నిర్వహణ డిజిటల్ పరివర్తననూ వేగవంతం చేసింది. దీని ఫలితంగా, పదవీ విరమణ క్లెయిమ్‌ల సగటు పరిష్కార సమయం 30 రోజుల నుంచి కేవలం 10 రోజులకు తగ్గింది. ఆన్‌లైన్ పెన్షన్ సవరణను, సవరించిన పెన్షన్ చెల్లింపు ఉత్తర్వుల జారీని సులభతరం చేయడానికి మరిన్ని డిజిటల్ మాడ్యూల్స్ అభివృద్ధి దశలో ఉన్నాయి. ఇది అవాంతరాలు లేని, కాగితరహిత పెన్షన్ జీవనచక్రానికి మార్గం సుగమం చేస్తుంది.

పదవీ విరమణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సి-కేర్స్ పోర్టల్ ద్వారా పదవీ విరమణ రోజే పీపీవోల జారీ, సీఎంపీఎఫ్ బకాయిల చెల్లింపునకు వీలు కలుగుతుంది. చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం గ్రాట్యూటీ విడుదలవుతోంది. సవరించిన పీపీవోల ప్రవేశంతో, అర్హులైన జీవిత భాగస్వామి వివరాలను చేర్చడం ద్వారా కుటుంబ పెన్షన్ ప్రారంభం సులభతరమైంది. పెన్షన్ పంపిణీ చేసే బ్యాంకులు సీఎంపీఎఫ్‌వో నుంచి ప్రత్యేక అనుమతి అవసరం లేకుండానే సాధారణ కుటుంబ పెన్షన్ కేసులను ప్రాసెస్ చేయడం వీలవుతుంది.

ఒక ప్రధాన సామాజిక భద్రతా చర్యలో భాగంగా, బొగ్గు గనుల పెన్షన్ పథకం కింద కనీస పెన్షన్‌ను 8 మార్చి 2024 నుంచి నెలకు రూ.1,000కి పెంచారు. దీనివల్ల సుమారు 40,000 మంది పెన్షన్‌దారులు లబ్ధి పొందారు.

ఈ చర్య పదవీ విరమణ చేసిన గని కార్మికులకు, వారి కుటుంబాలకు అధిక ఆర్థిక సహాయాన్ని అందించింది.

సీఐఎల్ తన ప్రధాన కార్యాలయం, అనుబంధ సంస్థల్లో ప్రత్యేక పదవీ విరమణానంతర ప్రయోజన విభాగాలు (పీఆర్‌బీసీలు) ఏర్పాటు చేయడం ద్వారా తన సహాయక వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. ఇవి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఏకైక సంప్రదింపు కేంద్రంగా పనిచేస్తాయి.

సీఐఎల్ పదవీ విరమణానంతర సంక్షేమ పథకంలో ఆరోగ్య సంరక్షణ కీలక విభాగంగా ఉంది.

## రాష్ట్రాభివృద్ధికి విమానయానం, స్వచ్ఛ ఇంధనం, సెమీకండక్టర్లు, అనుసంధానత రంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులు: పీఎం

న్యూఢిల్లీ, ఆగష్టు 3:ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.17,900 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ శంకుస్థాపన, ప్రారంభోత్సవం, జాతికి అంకితం చేసే కార్యక్రమాలను చేపట్టారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ఈ రోజుకున్న విశేష ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ.. ఇంతటి పవిత్రమైన మాసంలో ఉత్తరాంధ్ర పుణ్యభూమిని సందర్శించటం పట్ల ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ కూర్మనాథ స్వామి, పైడితల్లి అమ్మవార్లకు భక్తితో ప్రణామాలు సమర్పించారు. "ఈ చరిత్రాత్మక సందర్భానికి సాక్షిగా నిలిచేందుకు ఇవాళ ఉత్తరాంధ్ర పవిత్ర భూమిపై ఉన్నందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

దాదాపు పద్దెనిమిది వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ... విమానాశ్రయ మౌలిక సదుపాయాలు, రోడ్డు రవాణా అనుసంధానం, ఇంధన భద్రత వంటి బహుళ రంగాల కార్యక్రమాలు, రాష్ట్రం సాధిస్తున్న వేగవంతమైన పురోగతికి అద్దం పడుతున్నాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "ఈ అభివృద్ధి పనులు అద్భుతమైన వేగంతో పురోగమిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు ప్రతీక" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని అపూర్వమైన ఘట్టంగా అభివర్ణిస్తూ.. ఒకవైపు మౌలిక వసతుల కీలక ప్రాజెక్టులతో పాటు, మరోవైపు సంప్రదాయ థింసా నృత్యం ద్వారా సాధించిన అద్భుతమైన సాంస్కృతిక ప్రపంచ రికార్డుతో ఈ రోజు మరింత ప్రత్యేకంగా నిలిచిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. "కొత్త చరిత్ర సృష్టించటం, అనేక రంగాల్లో నూతన రికార్డులను నెలకొల్పటం కోసమే నేటి కార్యక్రమం" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

పదమూడు వేలకు పైగా గిరిజన సోదరీమణులు, కుమార్తెలు ప్రదర్శించిన అద్భుతమైన ప్రతిభను కొనియాడుతూ.. వారి అసాధారణ ప్రతిభను, క్రమశిక్షణను ప్రధానమంత్రి ప్రశంసించారు. ఈ ఉత్సాహభరితమైన ప్రదర్శన దేశ గొప్ప వైవిధ్యాన్ని, సంరక్షించిన స్వదేశీ వారసత్వాన్ని అందంగా ప్రతిబింబించిందని పేర్కొన్నారు. "ఇక్కడ ప్రదర్శించిన గిరిజన సంస్కృతి వైభవం నిజంగా అద్భుతమైన, మరువలేని దృశ్యం" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

అల్లూరి సీతారామరాజు వీరోచిత వారసత్వానికి, గిరిజనుల సంక్షేమం కోసం ఆయన చూపిన అంకితభావానికి నివాళిగా ఈ గడ్డపైనే నూతనంగా ప్రారంభించిన విమానాశ్రయాన్ని ప్రాంతీయ వృద్ధికి కీలకమైన మార్గంగా, యువత ఉజ్వల భవిష్యత్తుకు శక్తివంతమైన కేంద్రంగా ప్రధానమంత్రి అభివర్ణించారు. "ఆంధ్ర, ఉత్తరాంధ్రల వృద్ధికి రన్‌వేగా సేవలందిస్తున్న ఈ విమానాశ్రయం... ఆంధ్ర యువత మెరుగైన భవిష్యత్తుకు అత్యున్నత ప్రారంభ కేంద్రం" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

కొత్త విమానాశ్రయానికి దిగ్గజ స్వాతంత్ర్య సమరయోధుడి పేరు పెట్టాలనే ప్రభుత్వ అధికారిక నిర్ణయాన్ని ప్రకటిస్తూ... ఆ విమానాశ్రయం గుండా వెళ్లే ప్రయాణికులందరిలోనూ ఈ గొప్ప నివాళి దేశభక్తి భావాన్ని నింపుతుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

## 'ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి'

**-కొత్తగూడెం ఏరియా నూతన జీఎం సి. హెచ్.వెంకటరమణ**

**- పీవీకే-5 ఇంక్లైన్ ఉద్యోగులతో పరిచయ సమావేశం**



ఖమ్మం, ఆగష్టు 3: సింగరేణి కొత్తగూడెం ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సి. హెచ్.వెంకటరమణ సోమవారం తొలి షిఫ్ట్‌లో పీవీకే నెం.5 ఇంక్లైన్ గనిని సందర్శించి ఉద్యోగులు, అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. ముందుగా పీవీకే గని ఆవరణలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గని అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై గని నిర్వహణ, ఉత్పత్తి లక్ష్యాలు, భద్రతా ప్రమాణాలు, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాద రహిత వాతావరణంలో విధులు నిర్వహించాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు సింగరేణి ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు ఒక జట్టుగా సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితుల మెరుగుదల, సమస్యల పరిష్కారంలో యాజమాన్యం ఎల్లప్పుడూ సానుకూలంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఉద్యోగుల సూచనలు, సలహాలకు ప్రాధాన్యం ఇస్తూ పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్.ఓ. టు జీఎం ఎం. గోవిందరావు, పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, ఏరియా ఇంజనీర్ వి.రామకృష్ణ, గ్రూప్ ఇంజనీర్ గోదావరి శ్రీనివాస్, మేనేజర్ పి.రవికిరణ్, సేఫ్టీ ఆఫీసర్ ఆర్.అనిల్ సాగర్, పిట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ భూక్య రమేష్, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ చిలక రాజయ్యతో పాటు అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీబీజీ సోల్జర్‌థాన్‌ను ప్రారంభించిన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 3:భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ రోజు రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో, మిజోరాం గవర్నర్ జనరల్ డాక్టర్ వి.కె. సింగ్ (రిటైర్డ్) సమక్షంలో పీబీజీ (ప్రెసిడెంట్స్ బాడీగార్డ్స్) సోల్జర్‌థాన్‌ను వీడియో అనుసంధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె ప్రత్యేక పోస్టల్ కవర్‌నూ విడుదల చేశారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని కరియప్ప పరేడ్ గ్రౌండ్ వేదికగా ఈ పోటీ జరిగింది.

'సైనికుల కోసం పరుగెత్తండి, సైనికులతో కలిసి పరుగెత్తండి' అనే దార్శనికతతో... పౌరులకు, సాయుధ దళాలకు మధ్య బంధాన్ని బలోపేతం చేసే ఒక విశిష్ట వేదికగా ఈ సోల్జర్‌థాన్ నిలుస్తుంది. 'నిజమైన వీరులకు మద్దతు – భారత సాయుధ దళాలు' ఇతివృత్తం ఆధారితమైన ఈ కార్యక్రమం... మన సైనికుల అంకితభావం, ధైర్యం, త్యాగాలకు నివాళులర్పిస్తూ, చురుకైన భాగస్వామ్యం ద్వారా వారికి సంఘీభావాన్ని ప్రకటించేలా పౌరులను ప్రోత్సహిస్తుంది.


సోల్జర్‌థాన్ రేసులను 3 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లతో మూడు విభాగాల్లో నిర్వహిస్తారు. సోల్జర్‌థాన్ ద్వారా సమకూరే ఆదాయాన్ని ప్లారాప్లెజిక్ సైనికులకు చికిత్సనందించే పునరావాస కేంద్రం, యుద్ధంలో గాయపడిన సైనికుల పిల్లల సంక్షేమం మొదలైన సహాయక కార్యక్రమాల కోసం వినియోగిస్తారు. పీబీజీ సోల్జరథాన్ ముఖ్యోద్దేశం పీబీజీకి చెందిన గుర్రాలకు, దళాలకు అవసరమైన సహాయం అందించడం.

# "తెలుగుని తేజంగా మలిచిన మానవతావాది మండలి వెంకట కృష్ణారావు"

తెలుగు ప్రజల మధ్య నిస్వార్థత, నిష్కల్మషత, నిబద్ధత అనే మూడింటి సమ్మేళనంగా వెలిగిన మహా వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు. రాజకీయ నాయకుడిగా, సాంస్కృతిక చైతన్యంగా, భాషా సేవకుడిగా, మానవతా దృక్పథంతో జీవించిన వ్యక్తిత్వం అత్యంత విలక్షణమైనది. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలోని మోదుమూడి గ్రామంలో 1926 ఆగస్టు 4న జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే సత్యం, ధర్మం, విద్య, సేవ అనే గుణాల ప్రభావంతో నిర్మాణమైన కుటుంబంలో పెరిగారు. తండ్రి మండలి వెంకట సుబ్బయ్య గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం వల్ల విద్యతోపాటు సేవా భావన పట్ల గాఢమైన అభిరుచి పెరిగింది. గ్రామీణ వాతావరణంలో బాల్యం గడిపిన ఆయన చిన్నతనంలోనే తెలుగు భాషపై, సాహిత్యంపై, నాటక కళలపై మక్కువ పెంచుకున్నారు. ప్రాథమిక విద్య తరువాత గుంటూరులో ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బి.ఎ. ఆనర్స్ (తెలుగు)లో పట్టా సాధించారు. విద్యార్థి దశ నుంచే ఆచరణాత్మక భావజాలంతో సాహిత్య విమర్శ, నాటకరంగం, ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితుడయ్యారు.

స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ రంగంలో అడుగుపెట్టి యువ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన పదవుల కోసం కాక, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని ఆ రాజకీయాన్ని ఓ మార్గంగా మార్చుకున్నారు. 1962, 1967, 1972, 1978 సంవత్సరాలలో వరుసగా నాలుగు సార్లు అవనిగడ్డ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలవడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. నిస్వార్థ నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న అపారమైన అభిమానంతో ఆయన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో విలక్షణంగా నిలిచారు. 1972 నుండి 1978 వరకు విద్యా మరియు సాంస్కృతిక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యాశాఖ మంత్రిగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగుపర్చేలా, విద్యా నిధులను పెంచేలా, బోధనా విధానాల్లో మార్పులు చేయడంలో ఆయన గొప్ప శ్రమ చేశారు. గురుకుల విద్యాలయాల స్థాపన, అనాథ బాలబాలికల వసతి గృహాల ఏర్పాటుకు కృషి చేశారు. అంతేకాకుండా పాఠ్య పుస్తకాల్లో తెలుగు మాధుర్యాన్ని పటిష్ఠంగా నిలిపే దిశగా వ్యవస్థాపక చర్యలు చేపట్టారు.

సాంస్కృతిక శాఖా మంత్రిగా ఆయన చేసిన సేవలు తెలుగు భాషా సంస్కృతికి చిరస్థాయిగా నిలిచేలా చేశాయి. తెలుగు నిఘంటువుల రూపకల్పనకు ప్రభుత్వం స్థాయిలో ప్రోత్సాహం కల్పించారు. పాఠశాలలలో తెలుగు అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు, నాటక కళల ప్రోత్సాహానికి నిధుల కేటాయింపు వంటి చర్యలు ఆయన కృషిలో భాగం. తెలుగు భాషాభిమానిగా ఆయన చూపిన తపన అసాధారణమైనది. 1975లో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలను విజ్ఞాన, సాంస్కృతిక మహా కార్యక్రమంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులను ఏకతాటిపైకి తెచ్చిన ఈ మహాసభల అనంతరం స్థాపించబడిన అంతర్జాతీయ తెలుగు




కేంద్రానికి ఆయన వ్యవస్థాపక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం స్థాయిలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆయన దూరదృష్టికి ప్రతీకగా నిలిచింది.

ఆయన స్థాపించిన "జగతి" అనే సంస్థ వేదికగా నాటక రంగానికి అపూర్వ సేవలు అందించారు. ఈ వేదికపై ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహిస్తూ అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. కళ అంటే కేవలం వినోదమేగాక, విలువల బోధనా మాధ్యమమన్న అవగాహనతో ఆయన కళారూపాలను ఎంపిక చేసుకున్నారు. వ్యక్తిగతంగా ఆయన నాటక రచయితగా, ప్రదర్శకునిగా ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించారు. సాహిత్యంపై ఆయనకు ఉన్న అవగాహన, భాషాపట్ల ఉన్న ప్రేమ ఆయన రచనల్లో స్పష్టంగా ప్రతిఫలించాయి. "సాహిత్యసేవ", "మాజీమంత్రి ఆత్మకథ" వంటి రచనలు ఆయన అనుభవాల సంకలనం మాత్రమే కాదు, తెలుగు సమాజానికి ఓ దర్పణం. మహా భారతంపై ఆయనకు ఉన్న లోతైన అధ్యయనం ద్వారా ప్రజలకు నైతిక విలువలు బోధించే కార్యక్రమాలు చేపట్టడం మరో విశిష్టత. దేశంలోని అనేక ప్రాంతాల్లో మహాభారతంలోని ధర్మ సిద్ధాంతాలపై ప్రసంగాలు చేశారు. ఆయన ప్రవచనాలలో భాషా మాధుర్యం తోపాటు ప్రజల హృదయాలకు హత్తుకునే శక్తి ఉండేది.

అవనిగడ్డ నియోజక వర్గానికి ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో చెరిగిపోని గుర్తులుగా నిలిచాయి. విద్యా, నీటి పారుదల, రహదారులు, మత్స్యకారుల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో ప్రణాళికా బద్ధంగా పని చేసారు. 1977లో దివి సీమను కుదిపేసిన చాపడిపోటు తుపాను సందర్భంగా సహాయ చర్యలను సమన్వయ పరచడంలో ఆయన పాత్ర అపూర్వమైనది. శాసనసభ లోనే కాక, సహాయక కేంద్రాల్లో, బాధిత ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఆయన చేసిన సహాయ చర్యలు వేలాది ప్రజల జీవితాలను ప్రభావితం చేశాయి. విపత్తు సమయంలో అధికార వ్యవస్థతో సమన్వయం, ప్రజలలో నమ్మకం, రాజకీయ పార్టీలకు అతీతంగా స్పందించడం ఆయన సేవా ధర్మానికి పరాకాష్ట.

ఆయన సేవలకు గుర్తుగా దివి సీమను మెరుగు పరిచే పులిగడ్డ ? పెనుమూడి వంతెనకు ఆయన పేరు పెట్టడమే కాక, భవదేవర పల్లిలో "మండలి వెంకట కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్" స్థాపన ద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగును నింపారు. ఆయన కుమారుడు మండలి బుద్ధప్రసాద్ కూడా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, గాంధేయ వాదంతో కూడిన రాజకీయ జీవితం గడిపారు.

1997 అక్టోబర్ 27న ఆయన పరమ పదించారు. కానీ ఆయన ఆశయాలు, కార్య పద్ధతులు, విలువలు నేటికీ ప్రజల మనసుల్లో స్పష్టంగా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం సంక్షిప్తంగా చెప్పదగినదేమీ కాదు. అది ఒక చరిత్ర, అది ఒక విద్యా పాఠం, అది ఒక సాంస్కృతిక సంజీవని. మండలి వెంకట కృష్ణారావు మనకు చూపిన మార్గం ? ప్రజాసేవ పట్ల అంకిత భావం, భాషపట్ల అభిమానం, సమాజం పట్ల నిబద్ధత కలిగిన జీవన రీతికి ప్రతినిధి. ఆయన ఆదర్శ జీవితం తెలుగుజాతికి ఒక విలువైన పాఠశాల. ఈ రోజుల్లో సార్ధకమైన నాయకత్వం కోసం ఎదురు చూస్తున్న సమాజానికి ఆయన జీవితం ఒక పుట కథ కాదు ? ఒక చరిత్ర గ్రంథం. భావి తరాలకు సందేశం, మార్గదర్శకం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## తల్లి కాలు విరిగిందని మనస్తాపం.. ఉరివేసుకుని కుమారుడి బలవన్మరణం

కామారెడ్డి, ఆగష్టు 3:(నేటినిజం ప్రతినిధి)తల్లి కాలు విరిగిందనే మనస్తాపంతో ఓ బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులంతా ఆస్పత్రికి వెళ్లగా.. ఇంట్లోనే ఉన్న అతను దిగులుతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి పట్టణంలోని ఉస్మాన్‌పురా కాలనీలో నివాసం ఉండే మహ్మద్ ఇర్ఫాన్ సిద్దికి-అమీనా ఇర్ఫానా దంపతులు. వారికి అబ్దుల్ సలాం సిద్దికి, అబ్దుల్ సమద్ సిద్దికి (16) అనే ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తల్లి అమీనా ఇర్ఫానాకు రెండు రోజుల క్రితం చిన్న ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో శనివారం మధ్యాహ్నం ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనతో చిన్న కుమారుడు సమద్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలో శనివారం అందరూ ఆస్పత్రికి వెళ్లగా.. ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న సమద్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో పెద్ద కుమారుడు సలాం ఇంటికి వచ్చి చూసేసరికి బెడ్‌రూంలో ఫ్యాన్‌కు వేలాడుతున్న సమద్ కనిపించాడు. దీంతో కంగారుపడిపోయి అతను.. వెంటనే తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. అనంతరం సమద్‌ను జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అతను మరణించినట్లుగా వైద్యులు నిర్ధారించారు.

కాగా, తల్లి కాలు విరగడంతో బాధపడిన చిన్న కొడుకు మానసిక వేదనతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఇర్ఫాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మత్తు పదార్థాల బారిన పడకుండా యువతను కాపాడుకోవాలి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 3:వికసిత భారత్ సంకల్ప అభియాన్ లో భాగంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే 'నషా ముక్త్ యువా' కార్యక్రమాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా దాదాపు 28,000 ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమంతో అనుసంధానమైన కోటిమందికి పైగా యువతకు ప్రధానమంత్రి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం ప్రాధాన్యతను వివరిస్తూ, ఈ సమావేశాన్ని ఒక ప్రగాఢమైన జాతీయ ప్రతిజ్ఞగా అభివర్ణించారు. "ఈరోజు మన దేశవాసులందరం ఒక గొప్ప, అత్యంత ముఖ్యమైన సంకల్పం కోసం ఏకమయ్యాం" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

కార్యక్రమం సమగ్ర స్వరూపాన్ని ప్రస్తావిస్తూ, ఈ ఉద్యమం వ్యక్తిగత శ్రేయస్సుకే పరిమితం కాకుండా కుటుంబాలు, సమాజం, దేశం మొత్తానికి మేలు చేకూర్చేదిగా ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం నషా ముక్త్ యువ' కార్యక్రమం ప్రధాన లక్ష్యం గురించి వివరిస్తూ, వికసిత్ భారత్ నిర్మాణానికి శారీరకంగా ఆరోగ్యవంతమైన, మానసికంగా దృఢమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, ఎలాంటి వ్యసనాలకు బానిస కాని యువత అత్యంత అవసరమని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. "నేడు దేశం వికసిత భారత లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తరుణంలో, మన యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటూ, ఆత్మవిశ్వాసంతో నిండి, మత్తు పదార్థాల వంటి వినాశకర అలవాట్లకు శాశ్వతంగా దూరంగా ఉండటం అత్యంత ఆవశ్యకం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమం ఆవిర్భావాన్ని ప్రస్తావిస్తూ, గత ఏడాది పవిత్ర కాశీ నేలపై పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ ఉద్యమం నేడు జాతీయ స్థాయి కార్యక్రమంగా రూపుదిద్దుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. శాస్త్రీయ అవగాహన, ఆధ్యాత్మిక శక్తి, సాంస్కృతిక నిబద్ధతల సమన్వయంతో ఈ ఉద్యమం విస్తృతంగా ప్రజల్లోకి చేరిందని ఆయన అన్నారు. కాశీ డిక్లరేషన్ ఆధారంగా 125కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు, అనేక స్వచ్ఛంద సంస్థల మద్దతుతో ప్రారంభమైన ఈ ప్రజా సంక్షేమ ఆలోచన, నేడు విజయవంతంగా జాతీయ స్థాయి ఉద్యమంగా మారిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేసిన లక్షలాది మంది యువకులను ప్రధానమంత్రి అభినందించారు. తమ సొంత జీవితాల్లో వ్యసనాలకు దూరంగా ఉంటూనే, పాఠశాలలు, కళాశాలలు, సమాజంలో మత్తు లేని జీవితం ప్రాధాన్యతను చురుగ్గా ప్రచారం చేయడానికి వారు తీసుకున్న దృఢ సంకల్పాన్ని ఆయన ప్రశంసించారు. ఈ ఉద్యమం నిర్దేశించుకున్న 100 వారాల కార్యాచరణ ప్రణాళికను వివరిస్తూ, రాబోయే ప్రతి ఆదివారం కళలు, సంస్కృతి, క్రీడలు, ధ్యానం వంటి విభిన్న రంగాల్లో కొత్తవారిని భాగస్వాములను చేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. "రాబోయే 100 ఆదివారాలు కచ్చితంగా సంపూర్ణ మత్తురహిత భారత్ దిశగా 100 బలమైన అడుగులుగా మారతాయి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ సభ్యులు, మై భారత్ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగించారు. దేశ యువతలో కనిపిస్తున్న అవగాహన, సామాజిక బాధ్యత, అంకితభావం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భారత యువతను దేశ అమృత తరంగా అభివర్ణించిన ప్రధానమంత్రి, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత శక్తి, సృజనాత్మకత, ప్రతిభ కీలక పాత్ర పోషిస్తాయని గుర్తు చేశారు. దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం, అలాగే స్వంత జీవితాల కోసం కూడా యువత వ్యసనా లకు పూరిగా దూరంగా ఉండటం అత్యంత అవసరం" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు.

స్టార్టప్‌లు, కృత్రిమ మేధ, క్రీడలు, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో నేటి యువత సాధిస్తున్న విశేష విజయాలను ప్రస్తావిస్తూ, మాదకద్రవ్యాల వ్యసనం యువత ఏకాగ్రతను దెబ్బతీసి వారి కలలను ఛిద్రం చేస్తుందని హెచ్చరించారు. వ్యసనం వల్ల తల్లిదండ్రుల ఆశయాలు దెబ్బతినడంతో పాటు కుటుంబ పెద్దలు ప్రతిరోజూ మానసిక వేదనకు గురవుతారని పేర్కొంటూ, ఇది కుటుంబానికే కాక సమాజానికీ తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు.




## పెద్దికి కన్నీటి నివాళి..

ములుగు, ఆగష్టు 3: (నేటినిజం ప్రతినిధి) నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణాన్ని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు, నియోజకవర్గ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొని విలపిస్తున్నారు. ఆదివారం నల్లబెల్లి మండలకేంద్రానికి పెద్ద సంఖ్యలో చేరుకొని పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వనంగల్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పెద్ది చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం పెద్ది సతీమణి స్వప్నతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అలాగే స్థానిక మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్యాక్స్ మాజీ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్, నాయకులు ఊడుగుల ప్రవీణ్, పాలెపు రాజేశ్వర్‌రావు, సర్పంచులు జాటోత్ చిన్నరాథోడ్, అర్రెం సాంబయ్య, గందె శ్రీనివాస్‌గుప్తా, దేవ్‌సింగ్, అఖిల్, తిరుపతి, గూబ రాజు, శివాజీ, బొమ్మిడి శివారెడ్డి, నెక్కొండ మండల సీనియర్ నాయకుడు, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్, నాయకులు తాటిపెల్లి శివకుమార్, ఈదునూరి వెంకన్న, కారింగుల సురేశ్, దేవరబోయిన వీరబద్రం, పొడిశెట్టి సత్యం, మాతంగి రాజు, బండారు మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

## తీవ్ర వాతావరణాల్లో కార్మికుల రక్షణకు కేంద్ర చర్యలు

**-లోక్‌సభలో ప్రశ్నించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి**

తిరుపతి, ఆగష్టు 3:భారీ వర్షాలు, వరదలు, వడగాల్పులు, తుఫానులు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రభావం నుంచి అసంఘటిత, దినసరి కూలీలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

దేశవ్యాప్తంగా సంభవిస్తున్న తీవ్ర వాతావరణ పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ నమోదు చేస్తోందని మంత్రి తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, వివిధ రంగాల్లో అనుకూలతను పెంచడం లక్ష్యంగా కేంద్ర పర్యావరణ శాఖ జాతీయ వాతావరణ అనుసరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వడగాల్పుల సమయంలో కార్మికుల రక్షణ కోసం కేంద్ర కార్మిక శాఖ దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ అడ్వైజరీలు జారీ చేస్తోందని తెలిపారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచనలు ఇస్తు న్నట్లు పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ పరిశోధనా సంస్థల సహకారంతో వాతావరణ పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మరింత బలోపేతం చేసిందన్నారు.

## డీఎస్సీలో అక్రమాలను నిగ్గు తేల్చండి..

**-ఈనెల 6 నుంచి 9 వరకు రిలేదీక్షలు**
**-10వ తేదీన నియోజకవర్గాల్లో ర్యాలీలు**
**-బాధ్యతవహిస్తూ లోకేష్ రాజీనామా చేయాలి**
**-టీచర్ పోస్టుల భర్తీపై తక్షణం సీబీఐ విచారణ చేయించాలి**
**-వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్**




అనంతపురం ఆగష్టు 3: డీఎస్సీ-2025 నియామకాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యతవహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై అనంతపురం అర్బన్ నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, కుల సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంఓ తెలుగుదేశం, జనసేన, బీజేపీ లు జతకట్టి ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ తో పాటు అనేక హామీలను గుప్పించారని గుర్తు చేశారు.

యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తూ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. లేనిపక్షంలో ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సి పేరుతో పరీక్షలు నిర్వహించి, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడి అనర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని విమర్శించారు. తమకు కావాల్సి వారి కోసమే జీవోలను సృష్టించి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. తక్షణం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయన రాజీనామా చేయని పక్షంలో మంత్రివర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

అంతేకాకుండా డీఎస్సి అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో యువతకు చెప్పిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతకు చేస్తున్న అన్యాయాలను ఖండిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 వ తేదీల్లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రిలే నిరాహారదీక్షలతో పాటు ఈ నెల 10వ తేదీన ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, యువతకు, నిరుద్యోగులకు మద్దతుగా వైయస్సార్ సీపీ చేపట్టబోతున్న రిలే నిరాహారదీక్షలు, నిరసన ర్యాలీకి పార్టీ శ్రేణులతో పాటు మేధావులు, విద్యావంతులతో పాటు పెద్ద ఎత్తున యువతీయువకులు, విద్యార్థులు, రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## డీఎస్సీ స్కాంపై సీబీఐ విచారణే పరిష్కారం

విజయవాడ, ఆగష్టు 3: డీఎస్సీ-2025 నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్సార్సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

విజయవాడలోని ఎంకన్వెన్షన్ హాల్‌లో సోమవారం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశంలో దేవినేని అవినాష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆరోపించారు. డీఎస్సీ?2025 నియామక ప్రక్రియపై అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు ఎన్నికల హామీ మేరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## డీడబ్ల్యూఓ-చైల్డ్ ప్రొటెక్షన్ నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలి.. ఏఐటీయూసీ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 3:(నేటినిజం ప్రతినిధి): డీడబ్ల్యూఓ-చైల్డ్ ప్రొటెక్షన్ నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ విభాగంలో జరిగిన నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు మాట్లాడుతూ 2025 నోటిఫికేషన్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇతర జిల్లాలకు చెందిన, సంబంధిత అనుభవం లేని వ్యక్తులను నియమించారని ఆరోపించారు.

దీంతో గతంలో అనుభవంతో విధులు నిర్వహించిన సిబ్బందికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నియామకాల గడువు జూలై 2026తో ముగిసినందున, వారి సేవలను పొడిగించకుండా, 2025కు ముందు విధులు నిర్వహించిన అర్హులైన సిబ్బందిని తిరిగి విధుల్లో కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి, న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లె బాబన్న, పండుగ చంద్రయ్య, తైదల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.